Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు   స్థాపితం: 1930

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 51 • 4-12-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

లేజర్ చికిత్స
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

మావోయిస్టు సానుభూతి సంస్థల రంగ ప్రవేశంతో తెలంగాణా ఉద్యమం...

చెయ్యి దాటింది!

- చచ్చిన పాముకు ప్రాణం పోసి బ్రతికించింది పోలీసు యంత్రాంగం

తెలంగాణా ఉద్యమం వూహించని మలుపులు తిరుగుతున్నది. కొత్త పోకడలు పోతున్నది. కెసిఆర్ నిరసన దీక్షను ఎదుర్కోవడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వేసిన తప్పటడుగు వేర్పాటు వాదనకు వెయ్యేనుగుల బలాన్ని కల్పించాయి. ఒక రకంగా చెప్పాలంటే దుందుడుకు వైఖరితో చచ్చిన పాముకు ప్రాణం పోసి బ్రతికించారనడం నిజం.

మొన్నటి శాసనసభ ఎన్నికలలో టిఆర్ఎస్ చావు దెబ్బ తిన్నది. కెసిఆర్ నవ్వుల పాలైనాడు. ఆయన స్వంత పార్టీలో, ఆయన పెంచిపోషించిన వారే ఆయన్ను వీధులపాలు చేశారు. దానితో తెలంగాణా ఉద్యమం మసకబారింది. ఇక ఇప్పట్లో దానికి మళ్లీ జీవం లభించడం అసాధ్యమన్న నిశ్చయానికి వచ్చేశారు అందరూ. ప్రత్యేక తెలంగాణా వాదులంతా నీరసించిపోయారు. కానీ వున్నట్లుండి పరిస్థితి మారిపోయింది.

వైఎస్ బ్రతికి వుంటే...?

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణంతో ప్రభుత్వంలో ఏర్పడిన అనిశ్చితస్థితిని, బలహీన వాతావరణాన్ని తనకు సానుకూలంగా మార్చుకొన్నాడు కెసిఆర్. ఆమరణ దీక్షకు సంకల్పించాడు. ఆయన ఎత్తుగడ అనుకొన్నదానికంటే బాగా ఫలించింది. వైఎస్ బ్రతికిలేడన్న ధైర్యంతో ఒక్క కెసిఆర్ మాత్రమే కాక, ఇతరత్రా చాలా వర్గాలు కూడా తలెత్తి చూస్తున్నాయని ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోవడమే అందుకు కారణం. నిజానికి కెసిఆర్ పట్ల తెలంగాణావాదులలో కానీ, ప్రజలలో కానీ ఎంత మాత్రం విశ్వాసం లేదు. ఆయన ఆమరణ దీక్షకు నిలవలేడని అందరికీ తెలుసు. ఆయన ఆరోగ్యం అంతంత మాత్రం కావడం, ఇటువంటి నిరసనల పట్ల ఆయనలో చిత్తశుద్ధి లేకపోవడం జగమెరిగిన సత్యాలు. అయితే ఆయన అగ్గి పుల్ల మాత్రమే వెలిగించినా, ఆ మంటను దావానలం వలె మార్చి, రాష్ట్రాన్ని అతలాకుతలం చేయడానికి మావోయిస్టు సానుభూతి సంస్థలు సిద్ధమైనాయి. ఈ ప్రమాదాన్ని పసిగట్ట లేకపోవడం ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేసిన మహా నేరం.

పోలీసు అంచనా తప్పింది

దీక్షకు ముందే కెసిఆర్‌ను అరెస్టు చేసి, జైలుకు పంపితే ఆయన దీక్ష విరమిస్తాడని, అల్లరి ఆగిపోతుందని పోలీసులు భావించారు. అందుకు అనుగుణంగానే వ్యూహాత్మకంగా అరెస్టు చేసి, తెలంగాణా ప్రభావం లేని ఖమ్మం జైలుకు తరలించారు. నిమ్మరసం త్రాగించారు. కానీ అప్పటికే పిడిఎస్‌యు, ఆర్ఎస్‌యు, జనశక్తి, న్యూడెమోక్రసీ వంటి నిషేధిత జాబితాలో లేని మావోయిస్టు సానుభూతి సంస్థలు చెలరేగి పోయాయి. హైదరాబాద్, వరంగల్ నగరాలలోని విశ్వవిద్యాలయాలలో తమ విద్యార్థి సంఘాల ద్వారా నిప్పు రాజేశారు. ఈ పరిణామాలు తెలియని కెసిఆర్, పోలీసు అధికారులు ఒక లోటా నిమ్మరసంతో ఉద్యమం అణిగిపోయిందని భ్రమపడ్డారు. కానీ అది గొంతులోకి దిగకముందే, విద్యార్థుల ఆగ్రహం పెను ఉప్పెన వలె విరుచక పడడంతో కెసిఆర్ భయపడిపోయాడు. దీక్ష ఒక నాటకమన్న అభిప్రాయం విద్యార్థులకు కలిగితే తన రాజకీయ జీవితానికి మరణ శాసనం రచిస్తారని బెదిరిపోయిన ఆయన, మళ్లీ దీక్షకు దిగారు. పోలీసు తన చేత మోసపూరితంగా దీక్ష విరమింప చేసిందని ప్రకటించి, కొంతలో కొంత పరువు నిలుపుకొన్నాడు.

విద్యార్థులెందుకు వచ్చారు?

అయితే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆందోళనను పోలీసు సరిగా అర్థం

కొరప 14వ పేజీలో

స్వదేశాగమన శుభాకాంక్షలు
అమెరికా మరియు ఫ్రాన్స్‌లలో నెలరోజులపాటు దిగ్విజయంగా పర్యటించి నేడు స్వదేశానికి తిరిగి వస్తున్న



ప్రొఫెసర్ యం. శ్రీనాథ్ రెడ్డి, MDS.,
డా॥ ఎ. సుమలతారెడ్డి, M.D.,
స్కిన్ స్పెషలిస్ట్, పొగతోట, నెల్లూరు.
గార్లకు
మా హృదయపూర్వక స్వాగతసుమాంజలులు
స్టాఫ్
డా॥ హరిశ్చంద్రారెడ్డి దంత వైద్యశాల & సిరామిక్ సెంటర్
రామచంద్రారెడ్డి ఆసుపత్రి ప్రక్కన, బృందావనం, నెల్లూరు.
ఫోన్స్ : క్లినిక్ 2328060, ఇల్లు 2324723.
సుమ స్కిన్ క్లినిక్
మూడుహోళ్ళవీధి, పొగతోట, నెల్లూరు. ఫోన్ : 2302232

బలమైన, ఆరోగ్యకరమైన దంతాలకు ఒకేఒక్క చిరునామా! "స్మైల్"
10th Anniversary
10వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
10 వసంతాలు పూర్తిచేసుకున్న శుభసందర్భంగా వైద్యఖర్చులలో 30% రాయితీ
ప్రభుత్వోద్యోగులకు అరుదైన అవకాశం
నెలసరి వాయిదాలలో వైద్య ఖర్చులను చెల్లించే సదుపాయం
ఈ అవకాశం డిశంబర్ 1 నుండి 31వరకు మాత్రమే!
పళ్ళ మధ్య సందులు, ఎత్తుపళ్ళు, వంకరపళ్ళను
స్మైల్ డిజైనింగ్ ద్వారా ఒక్కరోజులో సరిచేయవచ్చును.
స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్
ఫోన్స్ : 0861-2344693, 92464 34447
నెల్లూరులో ప్రప్రథమంగా ISO 9001-2000 గుర్తింపు పొందిన డెంటల్ హాస్పిటల్

[నిర్బంధం...నేరం!]

ప్రత్యేక తెలంగాణా సాధన కోసం టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు చేపట్టిన ఆమరణ దీక్ష పట్ల ప్రభుత్వం, పోలీసు అనుసరిస్తున్న పోకడ బ్రిటీష్ పరిపాలనను మరిపిస్తున్నది. కెసిఆర్ ఉగ్రవాది కాదు. హింసాయుత ఉద్యమాలు నడిపిన వాడు కాదు. నూటికి నూరు పాళ్లు ప్రజాస్వామ్యం మీద, ప్రజాస్వామ్య ప్రక్రియలమీద విశ్వాసం వున్నవాడు. ప్రత్యేక తెలంగాణా ఆయన నమ్మిన సిద్ధాంతం. అందుకోసం గత పదేళ్ల నుంచి ఉద్యమిస్తున్నాడు. ఎన్నికల ద్వారా, రాజకీయ పార్టీల మద్దతు కూడ గట్టడం ద్వారా, ప్రభుత్వాలతో బేరసారాల ద్వారా తాను నమ్మిన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి ప్రయత్నం చేశాడు. కానీ అవన్నీ విఫలమైనాయి. ఇక వాటితో లాభం లేదని ప్రజలను సమీకరించడానికి, ప్రజాందోళన ద్వారా ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవడానికి సత్యాగ్రహాన్ని ఎంచుకొన్నాడు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన, ఆచరించి చూపిన శాంతియుత ఆందోళన మార్గం అది. ప్రపంచం యావత్తూ ఈరోజు ఆ ప్రక్రియ మీద ఆసక్తి, మక్కువ పెంచుకొంటున్నది. మన దేశానికి స్వాతంత్ర్యం తేవడానికి గాంధీ మహాత్ముడు దేశ ప్రజలకు అందించిన పాశుపతాస్త్రం అది. అది నిషిద్ధమని ఏ చట్టమూ చెప్పదు. ఏ ప్రజాస్వామికవాదీ దాన్ని అపసవ్య మార్గంగా భావించడు. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం సత్యాగ్రహం ఆటంబాంబు వలె కన్పిస్తున్నట్లుంది. కెసిఆర్ ఆమరణ దీక్షను నివారించడానికి చరిత్ర ఎరుగని స్థాయిలో పోలీసు జులుం ప్రదర్శిస్తున్నారు. ఆయన దీక్షాశిబిరానికి చేరుకోకముందే అరెస్టు చేశారు. దీక్షా ప్రాంగణంలో ఏర్పాట్లుచేస్తున్న వారందరి మీదా కేసులు పెట్టారు. దౌర్జన్య పూరితంగా జైలుకు పంపారు. అక్కడ దీక్ష చేయబోతే బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. వద్దంటున్నా సెలైన్ ఎక్కించారు. మోసం చేసి నిమ్మ రసం త్రాగించారు. ఆ దృశ్యాలను మీడియాకు అందించి కెసిఆర్‌ను ప్రజలలో చులకన చేయడానికి కుట్రపూరితంగా వ్యవహరించారు. ఆ తర్వాత ఆయన దీక్ష కొనసాగించబోతే, పోలీసులు చుట్టుముట్టి, దౌర్జన్యంగా సెలైన్ ఎక్కించడానికి యత్నిస్తున్నారు.

కెసిఆర్ ఆరోగ్యం నిరాహారదీక్షకు సహకరించే స్థితిలో లేని మాట నిజమే. దురదృష్టవశాత్తు ఈ దీక్ష వల్ల ఆయనకు జరగరానిది ఏదైనా జరిగితే తెలంగాణా జిల్లాలు అగ్నిగుండం వలె మారుతాయన్న మాట కూడా నిజమే. కానీ శాంతియుత పద్ధతులలో దీక్ష చేసే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికీ వుంది. అది శాంతిభద్రతల సమస్య అని ప్రభుత్వం భావిస్తే, దీక్ష చేస్తున్నవారితో మాట్లాడాలి. ఏ లక్ష్యం కోసం వారా నిరసనవ్రతం చేపట్టారో దాని ఆచరణలో వున్న సాధకబాధకాల మీద చర్చ జరపాలి. అందుకు ప్రభుత్వం తరపున కీలకవ్యక్తులు ముందుకు రావాలి. తామెంత చెప్పినా మాట వినకుంటే, అప్పుడు తదుపరి చర్యల గురించి ఆలోచన చేయాలి. అంతేతప్ప, పోలీసులను ప్రయోగించి దౌర్జన్యంగా, దుర్మార్గంగా శాంతియుత ఆందోళనలను అణిచి వేయాలని చూడడం నియంతృత్వ పోకడ అవుతుంది. ఇటువంటి నిర్బంధాలను బ్రిటీష్ ప్రభుత్వం కూడా అనుసరించ లేదు.

జమీన్‌రైతు

ముఖ్యమంత్రి రోశయ్య సుదీర్ఘ రాజకీయ అనుభవం కల్గినవాడు. ఇటువంటి ఉద్యమాలు, ఆందోళనలు ఎన్నింటినో ప్రత్యక్షంగా చూసినవాడు. కొన్నింటిలో తానే స్వయంగా పాల్గొన్నవాడు. ఆయన పరిపాలనలో పోలీసు జులుం ద్వారా సత్యాగ్రహాలను అణిచి వేయాలనే దురాలోచన కలగడం దురదృష్టకరం. సత్యాగ్రహం అనేది రెండు వైపుల పదును వున్న కత్తి వంటిది. దానిని అనుమతించడం వల్ల కలిగే ఇబ్బందుల కంటే, అణిచి వేయడం వల్ల కలిగే అనర్థాలు ప్రమాదకరమైనవిగా వుంటాయి. ఈ సత్యాన్ని గ్రహించి, శాంతియుతంగా జరిగే ఆందోళనలను శాంతియుత పద్ధతులలోనే ఎదుర్కోవడం ప్రభుత్వ బాధ్యత. కెసిఆర్ అంటించిన అగ్గిపుల్ల దావానలం వలె మారి తెలంగాణా ప్రజా జీవితంలో శాంతిని భస్మం చేయకముందే, రాజకీయ ప్రక్రియలు, పద్ధతుల ద్వారా, చర్చలు సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించే ఆలోచన చేయడం అందరికీ మంచిది.

జనవాణి

చిన్నవానకే రోడ్లు ఛిద్రం!

రహదారులు ప్రగతికి చిహ్నాలని గొప్పగా చెప్పుకోవడానికి మాత్రమే పనికి వస్తున్నాయి. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా వుంటున్నాయి. ఇటీవల వారం రోజులపాటు కురిసిన వర్షాలకు నగరంలోని ట్రంకురోడ్డు తోపాటు వన్‌టౌన్‌లోని రోడ్లన్నీ బాగా దెబ్బతినిపోయాయి. ఈ రోడ్లపై నడక కష్టంగా వుంది. కొత్తగా వేసిన రోడ్ల పనుల్లో నాణ్యత కొరవడడం వల్ల అవి దెబ్బతినిపోయాయి. ఏ అధికారీ ఈ వ్యవహారాలకు జవాబుదారితనం వహించక పోవడం బాధాకరం.

సిహెచ్.సురేష్‌బాబు, నెల్లూరు.

యుద్ధం ఎవరిమీద?

యుద్ధం ఎవరిమీద అంటూ 'జమీన్‌రైతు' నవంబర్ 20వ తేది సంచికలో వచ్చిన సంపాదకీయం అద్భుతంగా వుంది. శాంతికాముక దేశంలో అంతర్గత యుద్ధం అనర్థం. నక్సల్స్ ఉద్యమం సామాజిక అదుపాటలను ఎదురించే ప్రజా ఉద్యమం. దీనివల్ల సామాన్యులు ఈ ఉద్యమానికి ఇంత కాలం అండగా నిలుస్తున్నారు. దోపిడీదార్లు, లంచగొండులు, దురాశాపరులు, స్మగ్లర్లు, కల్తీవ్యాపారులు, ఇసుక మాఫియా, ఐరన్ఓర్ మాఫియా రాష్ట్రంలో విజృంభించడానికి ప్రస్తుతం మావోయిస్టులు లేకపోవడం కారణమని చెప్పక తప్పదు. దేశంలోని కొందరు పారిశ్రామికవేత్తలను కుబేరులను చేయను ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను కేంద్ర ప్రభుత్వం చేపట్టడం గర్హనీయం.

కె.పెంచలయ్య, కొడవలూరు.

రోశయ్యకు అభినందనలు

రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్యను కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా ఎన్నిక చేయించిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు. ఆర్య వైశ్యునిగా గాక, ప్రతిభావంతునిగానే రోశయ్య గారిని చూడాలి. సిఎల్పీ నాయకుని ఎన్నిక పూర్తవడంతో అనవసరపు చీకాకులు దూరమయ్యాయి. కాబట్టి రోశయ్య, స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రజాకర్షక పథకాలను పూర్తిచేసి రాష్ట్రంలో గుప్పుల కాలాన్ని మరిపించాలని మనసారా కోరుకొంటున్నాను.

కె.జగన్మోహన్‌రావు
పేరూరి నరసింహులు, నెల్లూరు.

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

8-12-1939
పేజీలు : 16 వెల: అణా

వెంకటగిరి పంచాయితీ ఎన్నికలు

పసుపు పెట్టెలోనే మీ ఓటు వ్రేయుడు. ఓటింగు రహస్య పద్ధతిన జరుగుతుంది. ఒక గదిలో రెండు రంగు పెట్టెలుంటాయి. మీ వద్ద యిచ్చిన ఓటు కాగితంపైన పేరు గాని, మరి యేలాటి గుర్తు గానీ వుండవు. గదిలోనికి వెళ్లి మీకిష్టమొచ్చిన రంగుపెట్టెలో ఓటు కాగితాన్ని వేయవచ్చు. మీరు ఎవరికి ఓటిచ్చినది బ్రహ్మదేవుడు కూడా కనుక్కొనజాలడు. కాబట్టి దేశ కల్యాణము కోరే కాంగ్రెసు పసుపు రంగు పెట్టెలోనే మీ ఓటు పడవేయండి.

ఇంకా గ్రుడ్డి బెదిరింపులా?

కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటిస్తే ఉద్యోగాలు పీకేస్తామని గ్రుడ్డి బెదిరింపులు చేస్తున్నారు. రంగు పెట్టెల పద్ధతిని మరిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన విషయాలు అప్పుడే మరచిపోయినట్లుంది. కడుపులో అభిమానం కలిగితే ఓటిస్తారుగానీ, బెదరించి, ఓటు తీసుకోవాలంటే జరిగే పనేనా? చిత్తంబాబూ, మీకేమా ఓట్లన్నీ తప్పకిస్తామని గుట్టుగా పసుపురంగు పెట్టెలో వేసి వస్తారు. ఓటరులారా! ఈ బెదిరింపులకు జడియవలసిన పనిలేదు. నిర్బంధ పరుస్తారని, మొహమాటాలు తప్పించుకోలేమని భయపడితే సరేనని ఆఖరుకు గుట్టుగా పసుపు పెట్టెలోనే మీ ఓటు పడవేసి ధన్యులు గండి.

– ఒక కాంగ్రెస్ సేవకుడు

ఉదయగిరి తాలూకాలో కాంగ్రెస్ ప్రచారం

బెజవాడ గోపాలరెడ్డి, వంగల్ల కోదండరామిరెడ్డి, నలమోతు చెంచురామానాయుడు, లేబూరు సుబ్బరామిరెడ్డి గారలు సంచారం గావించెదరు. ఆయా సెంటర్లకు సమీపంలో వుండు గ్రామస్తులు వచ్చి గ్రామ సౌకర్యములు, అభివృద్ధిని గురించి తెలుపగోరుచున్నాము. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గూర్చి కూడా ప్రచారము చేయుదురు.

–బద్దెపూడి వెంకటనారాయణరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

50 ఏళ్ల క్రితం ఈవారం

4-12-1959
పేజీలు: 12 వెల: 0-3-0

జడ్పీ అధ్యక్షునిగా చెంచురామానాయుడు!

జిల్లా పరిషత్ అధ్యక్షతకు కాంగ్రెస్ అభ్యర్థిగా నలమోతు చెంచురామానాయుడు గారు ఏకగ్రీవంగా వరింపబడ్డారు. ముఖ్యమంత్రి నుండి వచ్చిన ఈ సలహాను నెల్లూరు కోఆపరేటివ్ బ్యాంకులో ఆర్.నాదమునిరెడ్డి గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిషత్తు కాంగ్రెస్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో బెజవాడ గోపాలరెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి, పెళ్లేటి గోపాలకృష్ణారెడ్డి, తోటపల్లి గూడూరు సమితి అధ్యక్షులు మెట్టా రాజగోపాలరెడ్డి గారలు తప్ప తక్కిన అందరూ పాల్గొన్నారు. చెంచురామానాయుడు గారి పేరును సూచిస్తూ నీలం సంజీవరెడ్డి గారు చేసిన నిర్ణయం అందరికీ ఆశ్చర్యాన్ని కల్గించింది. ఏ ముగ్గురు, నలుగురు ఆంతరంగికులకో తప్ప చివరకు నాయుడుగారే నిర్ణయింపబడతారనే విషయం యితరులకు తెలియదు. తెలిసినవారు ఆఖరువరకు బయటపెట్టనందున, మధ్యలో కొందరు ఆశించడం, ప్రయత్నించడం, ఆశాభంగం పొందడం, అనవసర వివాదం తలెత్తడం సంభవించింది.

ఉపాధ్యక్షునిగా చంద్రశేఖర్‌రెడ్డి!

జిల్లా పరిషత్ ఉపాధ్యక్షతకు సంబంధించి నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గారిని నిర్ణయించాలనే కాంగ్రెస్ సభ్యులలోని అత్యధికసంఖ్యాకుల అభిప్రాయమే కడకు నెగ్గింది.

పాదిలేటి వెంకటస్వామిరెడ్డి గారిని నిర్ణయించిన ముఖ్యమంత్రి తానుగా ఉపసంహరించుకొని, చంద్రశేఖరరెడ్డి గారి నియామకానికి ఆమోదించలేదు. పార్లమెంటుసభ్యులు, శాసనసభ్యులు, పరిషత్తుసభ్యుల విజ్ఞప్తులు ముఖ్యమంత్రిని లొంగదీయలేక పోయినవి. చివరన వెంకటస్వామిరెడ్డి గారే తాను ఉపసంహరించుకొనుటకు ముఖ్యమంత్రి అనుమతి కోరగా, చంద్రశేఖర్‌రెడ్డి గారి నియామకానికి సంజీవరెడ్డి గారు అంగీకరించక తప్పిందిగాదు. అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడు కాబోయే సంజీవరెడ్డి గారి నియంతృత్వ, వ్యక్తిప్రాబల్య మనస్తత్వం ఈ ఒక్క విషయంలో ప్రస్ఫుటమయ్యింది. ఆయనకు చక్కని గుణపాఠం నేర్పారు నెల్లూరు పరిషత్తు కాంగ్రెస్ సభ్యులు.

నెల్లూరు ముచ్చట్లు

కలెక్టర్, జెసిల సెలవులపై విమర్శ

కలెక్టర్ రామ్‌గోపాల్ 27, 28, 29 తేదీల్లో, జాయింట్ కలెక్టర్ సారథ్ గౌర్ 27తేదీ నుంచి వారం రోజుల పాటు సెలవు పెట్టడం విమర్శకు తావిచ్చింది. కలెక్టర్ పెళ్లికి, జాయింట్ కలెక్టర్ స్వరాష్ట్రం హర్యానాకు వెళ్లినా ఆ సమయంలోనే కృష్ణపట్నం పోర్టులో పెద్ద ఎత్తున ఐరన్‌ఓర్ ఎగుమతులు, దిగుమతులు జరగడం; దాన్ని అడ్డుకొనే అధికారి లేకుండా పోవడంతో వున్నతాధికారులిద్దరూ ఈ నిందను మోయక తప్పలేదు.

బక్రీదు ప్రార్థనలకు రాని నాయకులు!

నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద బక్రీద్ పండుగను పురస్కరించుకొని జరిగిన ప్రార్థనలలో రాజకీయ నాయకులెవరూ హాజరు కాలేదు. ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు చెప్పే నెపంతో ఈ కార్యక్రమంలో ఆనం బ్రదర్స్, వారి వెన్నంటి వుండే నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి హాజరయ్యే వారు. ఒక్కోసారి ఈ నేతల వల్ల నమాజు తర్వాత జరిగే దువా కార్యక్రమానికి ఆటంకం ఎదురయ్యేది. ఎస్పీ మల్లారెడ్డి మాత్రం నమాజ్ పూర్తయ్యాక ఈద్గా వద్దకు వచ్చి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్లింల స్థలాలను సంరక్షించుకోవాలి

నెల్లూరు నగరంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ ఆస్తులను సంరక్షించుకోవాలని బక్రీద్ సందర్భంగా దర్గామిట్టలోని ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో మత పెద్ద పిలుపునిచ్చారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో నిలుపుతున్న కాంట్రాక్ట్ బస్సులలో నానా అప్రాచ్యపు పనులు జరుగుతున్నాయని వీటిని తక్షణం ఇక్కడనుంచి తొలగించాలన్నారు. రామ్‌నగర్‌లో సమ్మాన స్థలాన్ని ఆక్రమించిన వ్యవహారంలో ముస్లిం ఐక్యకార్యాచరణ సమితి పోరాటం చేస్తుందన్నారు. ఈ వ్యవహారాల్లో ముస్లింలు శాంతియుత ధోరణిలోనే నడవాలని మత పెద్ద సూచించారు.

ఆగని ఐరన్‌ఓర్ లారీలు

ఓబుళాపురం గనుల నుంచి ఐరన్‌ఓర్‌ను ఎగుమతి చేయకూడదని ప్రభుత్వం నవంబర్ 24తేది ఆదేశించినా కృష్ణపట్నం ఓడరేవుకు ఈ లారీలు వస్తూనే వున్నాయి. గతంలో 40టన్నుల లోడుతో వచ్చేవి ప్రస్తుతం 60 టన్నులతో వస్తున్నాయి. పోర్టులో లక్షల టన్నుల ఇనుప ఖనిజం నిల్వ వుంది. దీన్ని గుట్టుచప్పుడు కాకుండా చైనాకు ఎగుమతి చేస్తున్నారు. కాని ఈ వ్యవహారాన్ని పరిశీలించి చర్యతీసుకొనే అధికారే లేకుండా పోయారు.

డిఎంఅండ్‌హెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా డాక్టర్ వెంకటరమణారెడ్డి 27తేది బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కడపలో పని చేసేవారు. నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా పనిచేస్తుండిన చంద్రశేఖర్‌రెడ్డి అక్టోబర్ 31 తేది పదవీవిరమణ చేశారు. దీంతో క్షయాసుపత్రి ఇన్‌ఛార్జ్ డాక్టర్ సురేష్‌కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. కొత్త జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అయినా జిల్లాలో విజృంభించిన సీజనల్ వ్యాధులపై దృష్టి నిలపాల్సి వుంది.

విద్యార్థులను బ్యాంకర్లు ఆదుకోవాలి

పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికందించే విద్యారుణాలను మంజూరు చేయడంలో బ్యాంకర్లు సహకరించి సకాలంలో ఇచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాంగోపాల్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఇచ్చే విద్యారుణాలను మంజూరు చేయడంలో వారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో వివిధ సంక్షేమ పథకాల క్రింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయడంలో బ్యాంక్ అధికారులు సమన్వయంతో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ కె.ఆంజనేయులు, శాసనమండలి సభ్యులు రామిరెడ్డి, వితవు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
ఫోన్: 9246435616, 9849495665

కార్పొరేటర్ దౌర్జన్యం

తెలుగుదేశం పార్టీలో వుండి ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్ నవాబుపేటలోని చీదెళ్లవారి సత్రానికి సంబంధించిన స్థలాలలో నిర్మాణాలు చేపడుతుండడంతో దేవాదాయశాఖ వుద్యోగి కామేశ్వరరావు ప్రశ్నించారు. దీంతో కోపమొచ్చిన కార్పొరేటర్ ఈ వుద్యోగిని చొక్కాపించి రక్తమొచ్చేలా కొట్టారు. ఎమ్మెల్యే వివేకానందరెడ్డి కలుగజేసుకొని ఈ గొడవ పెద్దది కాకుండా దేవాదాయశాఖ వుద్యోగిని సముదాయించినట్లు తెలిసింది. దేవాదాయశాఖకు సంబంధించిన ఎన్నో ఆస్తులను నెల్లూరులో ఆక్రమించినపుడు గమ్మునుండిన సిబ్బంది ఇపుడు మాత్రమే ఎందుకు మేలుకొన్నారో?

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చిక్కులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-
విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

కాంగ్రెస్ కార్యాలయంలో అధికారిక కార్యక్రమం!

నెల్లూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరాభవన్‌లో కార్పొరేషన్ అధికారులు చీఫ్‌మినిస్టర్స్ కప్ బహుమతులు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటుచేయడం పట్ల డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నగరంలో ఈ కార్యక్రమం నిర్వహణకుగాను అనేక స్కూళ్లు, కస్తూరిబా కళాక్షేత్రం వంటి ప్రభుత్వ భవనాలున్నా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం వల్ల తమ పార్టీ కార్పొరేటర్లు హాజరుకాలేదని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని డిప్యూటీ మేయర్ జిల్లా అధికారులను కోరారు.



నెల్లూరు ఇందిరాభవన్‌లో వెంకటరమణ ఆర్యేద్ గ్రాండ్ ఎగ్జిబిషన్ సేల్స్‌ను ప్రోత్సహించి ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ప్రక్కన నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆర్యేద్ అధినేతలు మంచికంటి రాధాకృష్ణయ్య, రాయుడు, మేయర్ భానుశ్రీ వున్నారు.

టన్ను చెరకుకు రూ2100 చెల్లింపు!

కోవూరు షుగర్‌ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన రైతు సమన్వయ కమిటీ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ బి.గురుప్రసాద్ ఫ్యాక్టరీ క్రషింగుకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకొన్నారు. ప్రస్తుత క్రషింగ్ సీజన్‌కు సరఫరా చేసే చెరకుకు టన్నుకు 2,100 రూపాయలు చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని సరఫరా చేసిన 15 రోజుల్లో ఇస్తారు. గత సీజన్‌లో రైతులకు చెల్లించాల్సిన 25 లక్షల రూపాయలను సైతం క్రషింగ్ మొదలైన వెంటనే చెల్లిస్తామని మేనేజింగ్ డైరెక్టర్ హామీ ఇచ్చారు.

చలమయ్యకు ఇందిరా ప్రియదర్శిని పురస్కారం

నెల్లూరు వర్తక ప్రముఖుడు రొటేరియన్ కెవి చలమయ్యకు హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్ సంస్థ ఇందిరా ప్రియదర్శిని అవార్డును ప్రకటించింది. దీన్ని నవంబర్ 25తేది హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్ర చిన్న నీటిపారుదలశాఖా మంత్రి వి.సునీతా లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి పుష్పలీల, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం.వెంకటేశ్వరి చలమయ్యకు అందించారు.

మాగుంట సుబ్బరామిరెడ్డి 14వ వర్ధంతి

లోక్‌సభ మాజీసభ్యులు మాగుంట సుబ్బరామిరెడ్డి 14వ వర్ధంతి నెల్లూరు రాఘవకళ్యాణ మండపంలో 1తేది జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జి.వ మాజీ ఛైర్మన్ చెండలబాబు, మాజీ ఎమ్మెల్యే జె.కె.రెడ్డి, రంగనాయకుల దేవస్థానం ఛైర్మన్ ప్రతిరవీంద్రబాబు, పందిళ్లపల్లి అరుణమ్మ ఉడతా వెంకట్రావు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అద్దె ఇళ్లకు స్పెషల్ పన్ను

నెల్లూరు నగరంలోని అద్దె ఇళ్లకు పన్ను పెంచి తమ ఖజానా నింపుకోవాలన్న ఆలోచనకు కార్పొరేషన్ అధికారులు వచ్చారు. దీనికోసం నగరంలోని అద్దెఇళ్లపై సర్వే చేస్తున్నారు. ఇళ్లలో వుంటున్న వారిని ఎంత అద్దె చెల్లిస్తున్నారనే దానిపై వివరణ కోరుతున్నారు. అద్దె ఇళ్లకు పన్నులు పెంచితే వాటి యజమానులు ఆ భారాన్ని ఇళ్లలో వుండేవారిపైనే వేస్తారు. నిత్యావసరాల ధరలన్నీ పెరిగి నలిగిపోతున్న సామాన్య, మధ్యతరగతీయులను కార్పొరేషన్ స్పెషల్ పన్ను పెంపు భారం మరింత కృంగదీయడం ఖాయం.

జిల్లా రిజిస్ట్రార్‌గా శ్యామ్యూల్

జిల్లా రిజిస్ట్రార్‌గా సూర్యపోగు శ్యామ్యూల్ నియమింపబడ్డారు. విజయవాడ తూర్పు రిజిస్ట్రార్‌గా పని చేస్తుండిన ఆయన బదలీపై నెల్లూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన రామ

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

రక్తం మరిగిన రహదారులు

● 10 నెలల్లో 213 మంది మృతి

నెల్లూరు గుండా సాగిపోయే కలకత్తా, చెన్నై జాతీయ రహదారి మీద ప్రయాణమంటేనే భయమేస్తుంది. ప్రతిరోజు ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరిగి ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోతూనే వున్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టాల్సిన రోడ్డు సేఫ్టీ అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది గడిచిన పది నెలల్లో 213 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా 376 మంది క్షతగాత్రులైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. నెల్లూరు – ముంబాయి రహదారిపై జిల్లావాసుల ప్రాణాలను బళ్లారి నుంచి వచ్చే ఐరన్‌ఓర్ లారీలు బలి తీసుకొన్నాయి. కలకత్తా వైపు సాగిపోయే ఐదవ నెంబర్ జాతీయ రహదారిపై తడ నుంచి తెట్టు వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలన్నీ రోడ్డు ప్రక్కన నిలిపి వున్న వాహనాన్ని రోడ్డుపై వచ్చే వాహనం ఢీకొనడం వల్ల జరిగినవే. నిబంధనల ప్రకారం రోడ్డు సేఫ్టీ అధికారులు గుర్తించిన స్థలాలలోనే వాహనాలను పార్కింగ్ చేయాలి. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపరాదు. ఈవిధంగా నిలిపిన వాహనాల వద్దకు సేఫ్టీ అధికారుల పెట్రోలింగ్ వ్యాన్ వెళ్లి క్లియర్ చేయాలి. దీనికోసం టోల్‌ప్లాజాల వద్ద వాహనదారుల నుంచి ప్రత్యేక రుసుం వసూలు చేస్తారు. ఇది కోట్ల రూపాయల్లో వుంటుంది. ఇంత వసూలు చేసినా పెట్రోలింగ్ లేకపోవడం వల్ల రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. గతవారం చింతారెడ్డిపాళెం రోడ్డు జంక్షన్‌లో రోడ్డు ప్రక్కన నిలబెట్టి వుండిన లారీని తిరుపతి నుంచి వస్తుండిన క్వాలిస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల సేఫ్టీ విభాగం అధికారులు మేలుకొంటే బాగుంటుంది.



నెల్లూరు చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం (ఫైల్‌ఫోటో).

● లంచాలు తిని చోరుకొంటున్న ఎక్సైజ్‌శాఖ

డాబాల్లో అక్రమ మద్యం వ్యాపారం

నెల్లూరు నగర శివార్లలోని డాబాల్లో అనుమతి లేకుండా ప్రతినిత్యం లక్షల్లో మద్యం వ్యాపారం జరుగుతుంది. ఎక్సైజ్ అధికారులకు ఈ విషయం తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతూ గమ్మునుండి పోతున్నారు. పుణ్యక్షేత్రం గొలగమూడి వెళ్లే రూటులోని డాబాలో ప్రతినిత్యం లక్షల్లో మద్యం వ్యాపారం జరుగుతుంది. ఇక్కడ మద్యం సేవించిన జులాయిలు ఈ మార్గాన స్కూటర్లపై వెళ్లే భక్తులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చిల్డ్రన్స్ పార్కు రూటులో జాతీయ రహదారిని ఆనుకొని వున్న డాబా దగ్గర సాయంత్రం ఆరు గంటల నుంచి తెల్లవారేదాకే మందుబాబుల వీరంగం శృతిమించి పోతుంది. పొదలకూరు రోడ్డులో కొత్తూరు దాటాక కొత్తగా వెలసిన డాబా ముందు కార్లు, స్కూటర్లు బారులతీరి వుంటున్నాయి. చెముడుగుంట, బుజబుజనెల్లూరు మధ్యలోని నాలుగు డాబాలు బార్లుగా మారిపోయాయి. ఇక్కడా విపరీతమైన రద్దీ వుంటుంది. డాబాల నిర్వాహకుల నుంచి నెలసరి ఐదు లక్షలు ఎక్సైజ్ పోలీసులకు, మరో రెండు లక్షలు సివిల్ పోలీసులకు లంచంగా ముడుతుండంటే డాబాల్లో మద్యం వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని ఉన్నతాధికారులు అన్ని వ్యవహారాలను చూసీచూడనట్లు వుండడం వల్ల అక్రమ వ్యాపారాలు పెచ్చుపెరిగి పోతున్నాయి.



అనధికార బార్లుగా డాబాలు





వీకెండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పాట్‌గా కొత్తకోడూరు బీచ్ వద్ద ఏర్పాటుచేసిన ఆరోకెఫామ్ ల్యాండ్స్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖ న్యాయవాది అబ్బాయిరెడ్డి, నన్నపురెడ్డి విజయకుమార్‌రెడ్డి. పులిమి మల్లికార్జునరెడ్డితో ఫామ్‌ల్యాండ్ అధినేత వల్లపురెడ్డి రాధాకృష్ణారెడ్డి.



నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద సూర్య హోటల్స్ నిర్వాహకుడు ఆర్.చంద్రశేఖరసింగ్ కుమార్తె అర్చన, పెంచల కిరణ్‌సింగ్‌ల వివాహం నవంబర్ 4వ తేది సర్వేపల్లి కళ్యాణమండపంలో జరిగింది.

పెచ్చు పెరుగుతున్న

భూ వివాదాలు



నెల్లూరు రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో మేయర్ భానుశ్రీ ఆక్రమించను సిద్ధం చేసుకొంటున్న కార్పొరేషన్ రిజర్వ్ స్థలం.

నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లో ఇటీవల భూ వివాదాలు ఎక్కువయ్యాయి. నెల్లూరు నగరంలో రూరల్ ఎమ్మెల్యే అండదండలతో మేయర్ భానుశ్రీ, ఆమె అనుచరులు ఇష్టమొచ్చినట్లు కార్పొరేషన్ రిజర్వు స్థలాలు, స్మశానాలు సైతం అడ్డు ఆపు లేకుండా ఆక్రమించిపారేస్తున్నారు.

ఇటీవలకాలంలో నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు, తడ తదితర ప్రాంతాల్లో భూవివాదాలు ఎక్కువయ్యాయి. రాజకీయం, అధికారం, డబ్బు పలుకుబడి కలిగినవారు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. భూకబ్జాదారుల ఆగడాలు భరించలేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిల లాడిపోతున్నారు. తమ స్థలాలు, భూములు ఆక్రమణలకు గురవు తున్నాయని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు అనేక దఫాలు విన్నవించుకున్నా న్యాయం జరగడంలేదు.

భూకబ్జాదారులు నకిలీ దృవీకరణ పత్రాలు సృష్టించుకొని, వాటి ఆధారంగా ఆక్రమించుకున్న భూములు, స్థలాలు తమ వేనంటూ కోర్టుకెక్కుతున్నారు. అసలు హక్కుదారులు ఆర్థిక సమ స్యల కారణంగా కోర్టుకు వెళ్లలేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడు



నెల్లూరు శ్రీదేవికాలనీలో అధికార పార్టీ కార్పొరేటర్ ఆక్రమించిన స్థలం.

తున్నారు. నగరంలో కాని, బయట ప్రాంతాల్లో గాని ఖాళీ స్థలం కనిపిస్తే చాలు రాత్రికిరాత్రి దానిని ఆక్రమించి కట్టడాలు చేపడుతు న్నారు. భూవివాదాల సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు కోర్టుకు వెళ్లమని ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపు కొంటున్నారే తప్ప పరిష్కారం కోసం కృషి చేయడం లేదు.

నెల్లూరులో కోకొల్లలు!

నెల్లూరు నగరం ముత్యాలపాళెంలో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి అనుచరులుగా చెప్పుకొంటున్న వారు జెసిబిలతో పూరిగుడిసెలను కూల్చివేశారు. ఈ సంఘటనపై బాధితురాలు 4వ నగర పోలీస్ స్టేషన్‌లో బాధ్యులపై ఫిర్యాదుచేసినా పట్టించుకొనే దిక్కులేరు. అలాగే మాగుంట లేఅవుట్, ఉమ్మారెడ్డిగుంట సమీ పంలో పోలీసుల సహకారంతో ఇతర ప్రాంతంలో విధులు నిర్వ హిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి అనే సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ తన తమ్ముడి పేరుతో ధృవీకరణ పత్రాలు సృష్టించి ముస్లింలకు చెందిన స్థలంలో పక్కా భవనం నిర్మించారు.

మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేశారు. దీనికి ప్రక్కనే పట్టాభూములు వుండడంతో ఎవరికి అనుమానం రాకుండా ప్రభుత్వ స్థలాన్ని కలిపేసుకోవడం జరిగింది. నగరంలోని రామ్‌నగర్‌లో ముస్లిం స్మశానానికి చెందిన స్థలం, వేమాలశెట్టిబావి స్థలాలు వివాదాల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే. పై రెండు స్థలాలను రెండు వర్గాలకు చెందిన నాయ కులు స్వాధీనం చేసుకునేందుకు పోటీపడుతున్నారు. రిత్విక్‌ఎన్‌క్లేవ్ సమీపంలో మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలం వుంది. తాజాగా దీనిని కూడా కబ్జా చేసేందుకు అధికారపార్టీకి చెందిన నేతలు సన్నాహాలు చేసుకొంటున్నారు.

తోటపల్లి గూడూరులోనూ పలు గొడవలు

తోటపల్లి గూడూరు మండలంలోని భూములకు సంబంధించి వివాదాలు, ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. ఈ మండలంలో పాపిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో సర్వేనెం.510, 11, 12, 13 లలో 23ఎకరాల 50సెంట్ల మాగాణి భూములున్నాయి. ఈ భూము లలో పేడూరు, కృష్ణారెడ్డిపాళెం గ్రామాలకు చెందిన దాదాపు 50 కుటుంబాలకు చెందిన పేద ప్రజలు గత ఐదు సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నారు. పాపిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన హరి చరణ్‌రెడ్డి, మరికొందరు భూస్వాములు ఈ భూములను సాగు చేస్తున్న ప్రజలను వున్నట్లుండి అడ్డుకున్నారు. దీంతో కొద్ది రోజుల నుంచి ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి భయాందోళనలు నెలకొన్నాయి.

మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు భూస్వాములతో కుమ్మక్కై సాగుచేసుకుంటున్న వారిని అక్రమంగా అరెస్టు చేశారన్న వాదన వినిపిస్తుంది. అసలు ఈ భూములు ఎవరికి చెందినవి; ఎవరి నుంచి ఎవరు కొనుగోలు చేశారు? ఐదు సంవత్సరాల నుంచి పత్తాలేని భూస్వాములు ఇపుడు రంగ ప్రవేశం చేసి అన్ని రికార్డులు తమ వద్ద వున్నాయని చెప్పడం అనుమానాలను రేకెత్తిస్తుంది. పూర్తిస్థాయి విచారణ జరపకుండానే వివాదాస్పద భూములు భూస్వాములకు చెందినవి అని తహశీల్దార్ ప్రకటించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ భూములు ప్రభుత్వానికి చెందినవని, ఇవి తమకే దక్కాలంటూ ఆందోళన చేస్తున్న పేద ప్రజలకు సిపిఎం మద్దతు ప్రకటించింది. ఈ నేపధ్యంలో పేదలు భూముల్లోకి ప్రవేశించడం, పోలీసులు అడ్డుకోవడం వంటి సంఘటనలు తరచూ జరుగుతు న్నాయి. ఈ వివాదాస్పద భూములలో ఏక్షణంలో ఏం జరుగుతుం దోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ గాని, జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో భూముల వివరాలపై సమగ్రసర్వే నిర్వహిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవ కాశం వుంటుంది.

అవినీతి ఊబిలో రిజిస్ట్రేషన్‌శాఖ

నగరంతోపాటు వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసి వున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతి ఊబిలో కూరుకపోయి వున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన కక్షిదారుల భూములు, స్థలాలు వివరాలను పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. ఎన్ని నిబంధనలు విధించినా ఏదోఒక లోపంతో వాటిని అధికారులు, సిబ్బంది తమకు అనుకూలంగా మలచుకొంటున్నారు. ఒక ప్లాట్‌ను ఒకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం, రిజిస్ట్రేషన్ జరగకపోయినా కూడా జరిగినట్లు నకిలీ డాక్యుమెంట్లను పాత తేదీలతో తయారు చేయడం ఇక్కడ పరిపాటయ్యింది.

దీనికి ఉదాహరణగా నగరంలోని భక్తవత్సలనగర్ సమీ పంలో వున్న రాజగోపాల్‌రెడ్డినగర్‌లోని శ్రీదేవి కాలనీ చెప్పొచ్చు. 1988 సంవత్సరంలో 20మంది ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవడం జరిగింది. అప్పట్లో ఇక్కడ ప్లాటు ధర 8వేల నుంచి 11 వేల రూపాయల వరకు వుండేది. ప్రస్తుతం లక్షల్లో ధర పలకడంతో అధికారపార్టీకి చెందిన కార్పొ రేటర్ సహకారంతో ప్లాట్లను ఆక్రమించారు. ఒకరికి రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లను మరొకరు అక్రమించి బహిరంగంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకొన్న బాధితులు లబోదిబో మంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

చేతిలో అధికారం, రాజకీయం, డబ్బు పలుకుబడి వుంటే ఏపనైనా చేయవచ్చని ఈ సంఘటనను బట్టి నిర్ధారణ చేసుకో వచ్చు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న భూములు, ఖాళీస్థలాలు కళ్లముందే కబ్జాకు గురవుతుంటే నిస్సహాయులుగా చూస్తూ వుండి పోవడం తప్ప ఏంచేయలేకపోతున్నారు అభాగ్యులు.

భూకబ్జాలను నియంత్రించాలి!



నెల్లూరు నగరంలో ఇటీవల భూకబ్జాలు అధికంగా కొనసాగుతున్నాయి. పేదప్రజలు కష్టపడి సంపాదించుకొన్న సొమ్ముతో ఇండ్ల ప్లాట్లు కొనుగోలు చేసుకొంటే కొంతమంది స్వార్థపరులు వాటిని ఆక్రమించి సొమ్ము చేసుకొనేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు, రెవిన్యూ అధికారులు సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేకూర్చితే బాగుంటుంది.

దయాకర్‌రెడ్డి, శ్రీదేవి కాలనీవాసి, నెల్లూరు



జ్యోతిరావు ఫూలే 119వ వర్ధంతి సందర్భంగా నెల్లూరులో ర్యాలీ చేస్తున్న తెలుగుదేశం నాయకులు బీద రవిచంద్ర, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నూనె మల్లికార్జున్‌యాదవ్, వెంకటస్వామి నాయుడు.



నెల్లూరు వర్తకప్రముఖుడు కెవి.చలమయ్యకు ఇందిరా ప్రియదర్శిని అవార్డు ప్రదానం చేస్తున్న రాష్ట్రమంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి పుష్పలీల.



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యను కలసి సన్మానిస్తున్న నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ ఛైర్మన్ టి.బాలసుధాకర్.

కలువాయి రోడ్డు అధ్వాన్నం

• నరకయాతన పడుతున్న జనం

కలువాయి మండలంలోని ఆర్ అండ్ బి రోడ్లు అడుగడుగునా గుంటలు పడి అధ్వాన్నంగా తయారైనాయి. ఈ రోడ్డుపైన ప్రయాణించాలంటేనే ప్రయాణీకులు, వాహనచోదకులు హడలి పోతున్నారు. పొదలకూరు నుంచి సోమశిల వరకు 50 కిలోమీటర్ల పొడవునా రోడ్డు మార్గం దారుణంగా దెబ్బతిని వుంది. పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి, అనంతసాగరం మండలాలను కలిపే కీలకమైన ఈ రోడ్డు కొద్ది దూరం కూడా సక్రమంగా లేదంటే ఎంతగా దెబ్బతిని పోయిందో తెలుస్తుంది. ఈ మార్గాన ప్రయాణించే వారికి ఒళ్లు హూనం అవుతున్నది. రోడ్డు పాడైపోవడం వల్ల వాహనాలు తరచూ మరమ్మత్తులకు గురౌతున్నట్లు వాహన యజమానులు వాపోతున్నారు. రాకపోకలకు తీవ్ర విఘాతం కల్గిస్తున్న ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కోరుకొంటున్నారు.

• జిల్లా సమస్యలు

పట్టని ఎమ్మెల్యేలు!

జిల్లాకు చెందిన తొమ్మిదిమంది పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లా సమస్యలపై చర్చించడంలో మౌనవ్రతం పాటిస్తుండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే వున్నాయి. పనబాక లక్ష్మి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మువ్వరవు వెంకయ్య నాయుడు, లగడపాటి రాజగోపాల్, పి.మధు, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, చింతామోహన్, టి.సుబ్బిరామిరెడ్డిలు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గలవారే అయినప్పటికీ జిల్లా సమస్యలను పరిష్కరించడంలో తగిన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో సిమెంటు స్లీపర్ల ఫ్యాక్టరీకి గతంలో రైల్వే మంత్రిగా వుండిన లాలూ

తొమ్మిది మంది వుండి లాభమేమి?

ప్రసాద్ యాదవ్ పునాదిరాయి వేసినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. నిధులు అందక ఆ కార్యక్రమం ముందుకు సాగలేదు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను మరుగున పడిపోయింది. రవాణా రంగంలో అభివృద్ధి జరుగుతుందని ఎదురుచూసిన గూడూరు - దుగరాజపట్నం రైల్వేలైను కాగితాలకే పరిమితం అయ్యింది. బకింగ్‌హామ్ కెనాల్ ఆధునీకరణకు వేయి కోట్లు కేటాయించారని చెప్పున్నా దానికీ మోక్షం లేదు. పరిశ్రమలు వస్తాయి నిరుద్యోగ సమస్య తీరుతుందని చెప్పినా ఆ ఆశలు నిరాశలయ్యాయి. ఈ పరిస్థితులలో ఎమ్మెల్యేలుగా వున్న జిల్లా వాసులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుకొంటున్నది.

ముత్తుకూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో

దళారీల రాజ్యం

ముత్తుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి నిలయంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేయి తడపందే ఫైలు కదలదంటే ఎంతగా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారో తెలుస్తుంది. అధికారులకు, కార్యాలయానికి వచ్చే వారికి మధ్య కొందరు వ్యక్తులు దళారీ పాత్ర పోషిస్తుండడంతో కార్యాలయం గబ్బుపట్టిపోయింది. వీళ్లకు అడిగినంత ముట్టజెబితే ఏ పనైనా, ఎంతటి రిజిస్ట్రేషన్ అయినా నిమిషాల మీద జరిగిపోతుంది. లేదంటే రకరకాల అనుమానాలంటూ పెండింగ్‌లో పెడుతుంటారు. డబ్బులు కోరినంత అందజేసేవారికి కార్యాలయంలో రాచమర్యాదలు లభిస్తుండడంతో వారు ఆడింది ఆటయ్యింది. కార్యాలయంతో సంబంధంలేని బయటివ్యక్తులు ఈ లావాదేవీలన్నీ నిర్వహిస్తుండడంతో వీరిని దర్శనం చేసుకొంటే చాలు పనులన్నీ చకచకా అయిపోతాయనే ప్రచారం రావడంతో దళారులకు చేతినిండా కాసులు గలగలమంటున్నాయి.

నిధులున్నా...

ఖర్చు చేయరేమి?

నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినా పనులు పూర్తికాకపోవడంతో ఆశించిన ఫలితాలు రాలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి ఫండ్‌ను ఏర్పాటుచేసి శాసనసభ్యులకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. 2004 నుంచి 2009 వరకు మూడు దఫాలుగా ఎమ్మెల్యేలకు ఈ నిధులొచ్చాయి. 2005-06 సంవత్సరంలో 50 లక్షల రూపాయలు వుండగా, ఆ తర్వాత ఈ మొత్తాన్ని కోటి రూపాయలకు పెంచారు. నియోజకవర్గాలకు ఉపయోగపడే పనులు చేయాల్సి వున్నా వాటిని సరైన విధంగా వినియోగించుకోలేక పోవడంతో చాలా పనులు జరగలేదు. మరికొన్ని చోట్ల శాసనసభ్యుల వ్యవహారశైలి కారణంగా వివాదాలు తలెత్తాయి. 2005-06లో ఐదుకోట్ల 58 లక్షలు మంజూరు కాగా 50 పనులు కూడా జరగలేదు. 2006-07లో 11కోట్ల 9లక్షలు, 2007-08లో 11 కోట్ల 70లక్షలు విడుదలైనా పనులు జరగకపోవడం విచారకరం. ఎమ్మెల్యేల తీరూ అంతే. రెండు కోట్ల రూపాయల కేంద్ర నిధులను అంతంతమాత్రంగానే ఖర్చు చేశారు. పలు గ్రామాల్లో త్రాగునీటి సమస్య ప్రజలను వేధిస్తుంది. రోడ్డు పనులు, బ్రిడ్జిలు, కల్వర్టులు, భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో నిధులిచ్చినా పనులు సవ్యంగా జరుపుకోలేకపోయారనే అపవాదు మూటగట్టుకొన్నారు ఎమ్మెల్యేలు.

మురిగిపోతున్న నియోజకవర్గాల అభివృద్ధి నిధులు

పరిహారం స్వాహా

సెజ్‌ల కోసం సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం పంపిణీలో పేద గిరిజనులను దారుణంగా మోసం చేసి సొమ్మును స్వాహాచేసిన వైనం గగ్గోలు రేపుతుంది. చిల్లకూరు, కోట మండలాలలోని తీరప్రాంత గ్రామాలైన బల్లవోలు, తూర్పుకనుపూరు, వేళ్లపాళెం, కర్లపూడి, సిద్ధవరం, కొత్తపట్నం ప్రాంతాలలోని గిరిజనులకు చెందిన భూములకు ప్రభుత్వం పరిహారం అందివ్వగా రెవిన్యూ సిబ్బంది దీనిని దిగమ్రింగేశారు. తూర్పు కనుపూరు సెజ్‌లో గిరిజనులకు వలల కొనుగోలు కోసం బ్యాంకుల్లో రుణాలు ఇప్పించినట్లుగా చూపించి ఆ మొత్తాన్ని కొందరు భూస్వాములు బొక్కేశారట. ఈ పరిహారం అవకతవకల్లో రెవిన్యూ సిబ్బంది, బ్యాంకు అధికారులతోపాటు స్థానికంగా వుండే కొందరు భూస్వాముల పాత్ర వున్నట్లు సమాచారం.

బలహీనంగా చెరువు కట్టలు

((గూడూరు డివిజన్‌లో పరిస్థితిది))

గూడూరు డివిజన్‌లోగల చెరువు కట్టల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది. ఆరు వందలకుపైగా చిన్నా పెద్దా చెరువులు వున్నాయి. వీటిలో అధిక భాగం చెరువు కట్టలు బలహీనంగా వుండడంతో గండ్లుపడే పరిస్థితులు నెలకొని వున్నాయి. ఈ కారణంగా పలు చెరువుల్లో వర్షం వచ్చినా నీరు నిలచే పరిస్థితిలేని కారణంగా చెరువు నీటిపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు గూడూరు మండలంలోని దివిపాళెం చెరువుకు గండి పడింది. వెడిచర్ల చెరువుకు గత ఏడాది గండి పడినా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో చుక్కనీరు లేదు. చెన్నూరు చెరువు తూముకు మరమ్మత్తులు చేసినా నాణ్యతలేని కారణంగా నీరు వృధా అవుతోంది. చిల్లకూరు మండలం కలవకొండ చెరువుకు గండ్లు పడ్డాయి. సైదాపురం మండలం గ్రిద్దలూరు చెరువుకు భారీ గండి పడడంతో చెరువులో నీరులేక తాగునీటికి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. చెరువు కట్టల మరమ్మత్తులపై సంబంధిత శాఖ పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆటోలున్నాయి... బస్సులాపేస్తాం!

గూడూరు ఆర్టీసీలో పిచ్చి తుగ్లక్‌లు

అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని పదే పదే ప్రకటించే ఆర్టీసి సంస్థ అందుకు విన్నంగా వ్యవహరిస్తోంది. ఆటోలు తిరుగుతున్నాయని నడిచే బస్సులను రద్దుచేసి తన తుగ్లక్ బుద్ధిని రుజువు చేసుకొంది గూడూరు ఆర్టీసి డిపో. పొదలకూరు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తూ వుంటారు. వీరంపల్లి, మనుబోలు మీదుగా గూడూరుకు ఐదు బస్సులు తిరుగుతుండేవి. బస్సులకు తోడు ఆటోలు ఈ మార్గంలో తిరుగుతుండడంతో దీనిని సాకుగా చూపించిన ఆర్టీసి అధికారులు ప్రయాణికులు బస్సుల్లో ఎక్కడం లేదని, అందరూ ఆటోల్లోనే ప్రయాణిస్తున్నందున బస్సులన్నింటినీ రద్దుచేసి ఒక్క బస్సును మాత్రం తిప్పుతుండడంతో ఈ ప్రాంతవాసులు ప్రయాణించేందుకు అగచాట్లు పడాల్సి వస్తోంది. పొదలకూరు, పార్లపల్లి, చెర్లోపల్లి, విరదవోలు, వీరంపల్లి, మడమనూరుల నుంచి ఘుమారు 200 మంది గూడూరు రావాలంటే ఆటోలపైనే ఆధారపడాల్సి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రజల అవసరాన్ని గుర్తించి బస్సులను యధావిధిగా నడపాల్సిన బాధ్యత ఆర్టీసి అధికారులపై వుంది.



బక్రీద్ సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలోని ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లిం సోదరులు.

ఇందిరమ్మ ఇళ్లతో కన్నీళ్లు

డమ్మాయిపాళెంవాసులకు ఎన్ని కష్టాలో?

పేదవారికి నీడ కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం లబ్దిదారులకు కన్నీళ్లు మిగిలిస్తోంది. బిల్లుల చెల్లింపు జరగక, సకాలంలో ఇంటిని పూర్తిచేసుకోలేక నానా అగచాట్లు పడుతున్నారు లబ్దిదారులు. ముత్తుకూరు మండలంలో పరిశీలించినట్లయితే ఇందిరమ్మ లబ్దిదారులు పడుతున్న కష్టాలు అవగతమౌతాయి. డమ్మాయిపాళెం గ్రామంలో పలువురు ఇళ్లను నిర్మించుకొన్నప్పటికీ బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం కన్పించక ఆవేదన చెందుతున్నారు. శ్లాబ్‌లు పూర్తయి ఇళ్లు సిద్ధమైనప్పటికీ బిల్లులు చేతికి అందకపోవడంతో అప్పులపాలవుతున్నామని పలువురు లబ్దిదారులు బాధపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వీరి గురించి పట్టించుకోకపోవడంతో సొంత ఇంటిని నిర్మించుకోవచ్చన్న వారి ఉత్సాహం ఆవిరైపోతున్నది. అసలే ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న పేదలకు బిల్లుల చెల్లింపులో జాప్యం కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నది.

ముత్తుకూరులో చెట్ల క్రింద చదువులు

● ఇదా సాధించిన అభివృద్ధి

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ముత్తుకూరు మండలంలో పాఠశాలల విద్యార్థులు మాత్రం పలు అవస్థలు పడాల్సి వస్తోంది. పోర్టు నిర్మాణం, పవర్ ప్రాజెక్టులతో ముఖ్యేంద్రంగా ముత్తుకూరు మండలం మారుతుంటే ప్రక్కనేగల చలివేంద్రం గ్రామంలోని విద్యార్థులు మాత్రం చెట్ల క్రిందనే చదువుకోవాల్సి వస్తున్నది. ఇక్కడే వున్న ప్రాథమిక పాఠశాల శిధిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో పిల్లలు చెట్ల క్రిందనే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఎండాకాలంలో ఎలాగోలా జరిగిపోతున్నా వర్షాకాలంలో మాత్రం విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. దీంతో పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి. పాత భవనాన్ని కొలగించి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని పలుమార్లు గ్రామస్థులు అధికారులకు విన్నవించుకొన్నా ఫలితం లేకపోవడంతో విద్యార్థులు చెట్ల క్రిందనే చదువుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. అవసరంలేని చోట భవనాలను నిర్మించే సర్వ శిక్షా అభియాన్, విద్యాశాఖ అధికారులకు ఈ గ్రామంలో పిల్లలు పడే ఇబ్బందులు కన్పించకపోవడం విచారకరం.

నెల్లూరు సర్పంచుల మహారాష్ట్ర యాత్ర!

జిల్లా నుండి 38 మంది సర్పంచులు మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్ జిల్లా హెవ్రీబజార్ ఆదర్శ గ్రామం సందర్శనకు ప్రత్యేక బస్సులో 26వ తేది బయలుదేరి వెళ్లారు. ఈ బస్సుకు జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాంగోపాల్ జెండా ఊపి పంపారు. జిల్లా నుంచి వెళ్లిన సర్పంచులు హెవ్రీబజార్ పంచాయితీలో అమలు జరుగుతున్న ప్రభుత్వ పథకాలను అధ్యయనం చేస్తారు. అనంతరం జిల్లాలోని పంచాయితీల్లో ఇదే తరహా పనులకు శ్రీకారం చుడతారు. ఈ కార్యక్రమం ఏర్పాటుకు బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్, జిల్లా పంచాయితీ అధికారి సహకరించారు.



నెల్లూరు రాజీవ్‌గాంధీ భవన్ నేతృత్వంలో ముంబై అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు.

పడుగు పనివారి కష్టాలు

పగవారికి కూడా వద్దు

దేశవిదేశాలలో సైతం పేరు ప్రఖ్యాతులు గడించింది వెంకటగిరి చేనేత. ఇక్కడి నేత కార్మికులు తయారుచేసే జరీ చీరలకు విదేశాలలో సైతం ఎంతో గిరాకీ వుంది. అలాంటి చీరలను తయారు చేయడంలో పడుగు పని వారి పాత్ర కీలకం. రంగులు అద్దిన నూలుకు పడుగులు పట్టి, గంజిపూసి, పోగులుగా విడదీసి మగ్గంపై వేసుకొనేందుకు వీలుగా నూలును తీసి పడుగులుగా తయారు చేయడం వీరి పని. ఈ పడుగు పట్టిన నూలుకు అచ్చు అతికి అల్లుపెట్టి తర్వాత మగ్గంపై నేతకు సిద్ధం చేస్తారు. అలాంటి పనిలో 60 గిరిజన కుటుంబాలు అక్చర్ నివాస కండ్రిగలో ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. వీరికి చేనేత కార్మికులకు ఇచ్చే గుర్తింపుకార్డులు, హెల్త్‌కార్డులు, ఇతర ప్రయోజనాలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేనేత కార్మికులకు ప్రయోజనాలను అందించే ప్రజాప్రతినిధులు ఉపవృత్తుల వారి గోడు పట్టించుకోకపోవడం వట్ల పడుగు పనివారు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

వరిలో పాముపొడ తెగులు

వరి పంటను ఆశించే తెగుళ్లలో పాము పొడ తెగులు ప్రమాదకరమైనదని, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే రైతులకు అపారనష్టం సంభవిస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది ఈ పాముపొడ తెగులు ఆశించి ఘుమారు పదివేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నదని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో బోరు బావుల క్రింద వేసిన వరి పంటకు ఈ తెగులు ఆశించి వుందన్నారు. అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు తదితర మండలాల్లో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా వుందన్నారు. ఆకులలోని పత్ర హరితాన్ని పాముపొడ తెగులు హరిస్తుందన్నారు. దీని వలన ఆకులు వాడిపోయి పాము పడగ ఆకారంలోకి మెలితిరుగుతున్నాయన్నారు. దీనిని తొలి దశలోనే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేవట్టినట్లయితే పంటను కాపాడుకోవచ్చని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని వలు ప్రాంతాలలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రైతుశిక్షణ కేంద్రం ఉప సంచాలకులు జగదీశ్వరరాజు చెప్పారు.



'విజయమ్మకు' మంత్రిపదవి

స్వర్గీయ వైఎస్ సతీమణి విజయమ్మకు మంత్రి పదవిని యివ్వాలని రోశయ్యపై ఒత్తిడి ఎక్కువైంది. పులివెందుల నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన విజయమ్మకు మంత్రి పదవి యిచ్చి గౌరవించాలంటూ వైఎస్ వర్గీయులు రోశయ్యను కోరుతున్నారు. జగన్ యిప్పట్లో సిఎం అయ్యే అవకాశాలు దాదాపుగా లేనందున విజయమ్మను మంత్రివర్గంలో వుంచాలని వైఎస్ వర్గీయులు భావిస్తున్నారు. విజయమ్మకు మంత్రి పదవి ఇచ్చి ప్రస్తుతం వుంటున్న నివాసంలోనే కొనసాగేట్లు చూడాలని, అప్పుడే వైఎస్ ఆత్మకు శాంతి కలుగుతుందంటూ వారు కొత్తవాదాన్ని తెరపైకి తెచ్చారు. శాసనసభ్యులుగా మొదటిసారి ఎన్నికైనవారిని మంత్రి వర్గానికి దూరంగా పెట్టాలని అధిష్టానం నిర్ణయించింది. అయితే విజయమ్మ విషయంలో దీనికి మినహాయింపు ఇవ్వాలని కూడా వారు సూచిస్తున్నారు. రోశయ్య ఢిల్లీ పర్యటనలో ఈ విషయాన్ని అధిష్టానంతో చర్చించే అవకాశం కూడా వుందంటున్నారు.



జనంలోకి 'జగన్'

పులివెందుల ఉపఎన్నిక ఏకగ్రీవంగా జరగటంతో ఇక జనంలోకి వెళ్లాలని జగన్ నిర్ణయించాడు. సిఎం పదవి కోసం శతవిధాలా ప్రయత్నించి భంగపడిన జగన్ ఇక జనం మద్దతును కూడగట్టాలని భావిస్తున్నాడు. రాష్ట్రంలో వైఎస్ మద్దతుదారులందర్నీ ఒకేతాటిపైకి తెచ్చి వర్గాన్ని కాపాడుకోటానికి రాష్ట్ర పర్యటనను వాడుకోవాలనుకుంటున్నాడట. ఇప్పటికే జగన్ పర్యటనకు సంబంధించి ఆయన శిబిరంలో చర్చలు ప్రారంభమయ్యాయి. వైఎస్ మృతి వార్తను భరించలేక చనిపోయివారి కుటుంబాల్ని కూడా పరామర్శించి, వారికి కొంత ఆర్థికసాయాన్ని కూడా అందించాలన్నది వైఎస్ శిబిరం వ్యూహం. జగన్ రాష్ట్ర పర్యటనలో లక్షలాది మందిని సమీకరించి అధిష్టానాన్ని ఆకట్టుకోవాలన్న దానిపై జగన్ మద్దతుదారులు ప్రధానంగా దృష్టి పెడ్తున్నారు.

సభానాయకుడి కోసం పోటాపోటీ



రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం కోసం పోటీ తీవ్రంగా తయారైంది. సిఎం రోశయ్య శాసన మండలి సభ్యుడు కావటం వల్ల శాసనసభలో ఫ్లోర్ లీడర్‌గా ఎమ్మెల్యేను ఎన్నుకోవాల్సి వుంది. దీనికోసం రాష్ట్రమంత్రులు బొత్సా సత్యనారాయణ, రఘువీరారెడ్డి మధ్య పోటీ ఎక్కువైంది. రఘువీరాకు జగన్ మద్దతు వుంది. బొత్సాకు కేశవరావు వంటి ఢిల్లీ నాయకుల ఆశీస్సులున్నాయి. జగన్ వర్గానికి చెందినవాడు కావటం వల్ల రఘువీరాను దూరంగా పెట్టాలని రోశయ్యపై ఒత్తిడి ఎక్కువైంది. బొత్సా కూడా వైఎస్ వీరాభిమానే. అయితే కొంతకాలంగా ఆయన జగన్ శిబిరానికి దూరంగా వుంటున్నాడు. శాసన సభా నాయకుడి పదవి దక్కితే ఆ తర్వాత సిఎం అయ్యేందుకు అవకాశాలుంటాయని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో ఈ పదవి కోసం తాడోపేడో తేల్చుకోడానికి మంత్రులిద్దరూ సమాయత్తమవుతున్నారు.

నోరుపారేసుకొంటున్న ఎమ్మెల్యే



కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరరావు ఈ మధ్య నోరు పారేసుకొంటున్నారని సిఎల్పీలో చెవులు కొరుక్కొంటున్నారు. మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి అల్లుడైన శంకరరావు గతంలో రాష్ట్రమంత్రిగా పని చేశాడు. వైఎస్ కాలంలో శంకరరావును దూరంగా పెట్టారు. అప్పట్లో అసంతృప్తి వాదిగా, శంకరరావు వార్తల్లో కనిపించేవాడు. వైఎస్ మరణం తర్వాత శంకరరావు తిరిగి మంత్రి పదవికోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో రోశయ్యకు మద్దతుదారుగా మారాడు. ఇటీవల నగర ఎన్నికల్లో ఓ పోలీసుఅధికారిపై దురుసుగా వ్యవహరించి వివాదంలో తలదూర్చాడు. ప్రత్యేక తెలంగాణాకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు గరమ్ అయిపోయి చెడామడ తిట్టిపోశాడు. తెలంగాణా కోసం తాను పోరాడినప్పుడు సదరు విలేకరులు పుట్టనే లేదంటూ రుసరుసలాడట. మంత్రి కాకముందే శంకరరావు ప్రవర్తన యిలా వుంటే ఆ తర్వాత ఎలా ఉండబోతుందోనంటూ పార్టీ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి.

కృతజ్ఞతలు

మానస ప్లాజా & మానస హోటల్స్

Hotel Manasa

హరనాధపురం, మొదటివీధి
నెల్లూరు.

ఫ్యామిలీ ఫ్యామిలీయస్ రెస్టారెంట్



2.12.2009తేది జరిగిన మా

మానస ప్లాజా & మానస హోటల్

ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన

శ్రీ అనం వివేకానందరెడ్డి గారికి
నెల్లూరురూరల్ శాసనసభ్యులు



శ్రీ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి గారికి
నెల్లూరు నగర శాసనసభ్యులు

శ్రీమతి నందిమండలం భానుశ్రీ గారికి
మేయర్, నెల్లూరు

శ్రీ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి గారికి
డిసిసిబి వైస్ ఛైర్మన్

మరియు మిత్రులు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు



ఉయ్యాల మస్తానయ్య



ఉయ్యాలశ్రీనివాసులు



ఏదేశమేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.

1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- | జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక



సోమిరెడ్డే గ్రేట్

గతవారం ఫలితాలు వెలువడ్డ గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలకు పలువురు నెల్లూరు నేతలు వెళ్లి ప్రచారం చేశారు. మునిసిపల్‌మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌ఛార్జీలుగా పనిచేశారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్లలో నాలుగు తెలుగుదేశం పార్టీ స్వంతం చేసుకోగా, రెండు మాత్రమే అతి కష్టం మీద కాంగ్రెస్ పార్టీ గెలవగలిగింది. దీంతో సోమిరెడ్డి తానే ఎన్నికల్లో గెలిచినట్లు ఫీల్ అయిపోతున్నాడు. ఆయన ఈ ఘనతను నెల్లూరు పాత్రికేయుల ముందు ప్రకటించడంతో మునిసిపల్ మంత్రి లోలోన కుతకుతలాడిపోతున్నాడు.



చుక్కలనంటిన వంకాయ

వంకాయ వంటి కూర ఇలలో లేదని మనకవులు ఘనంగానే వర్ణించారు. నెల్లూరులోనే మాత్రమే దొరికే తెల్ల వంకాయలంటే నెల్లూరీయులకు మహా ప్రీతి. పది రూపాయలకు దొరుకుతుండిన ఈ వంకాయలు గతవారం పదిరోజులుగా ఒక్కోమెట్టు ఎదిగినట్లు కిలో ఏకంగా 40 రూపాయలయ్యాయి. దీంతో ఇటు మాంసాహారులు, అటు శాఖాహారులు పెరిగిన వంకాయ ధరలకు కళ్లు తేలేస్తున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టరాధులు ఎన్ని సమీక్షా సమావేశాలు పెట్టినా కూరగాయల ధరలను మాత్రం తగ్గించలేకున్నారు.



విష్ణుసహస్రనామ పారాయణం శుభకరం

విష్ణుభగవానునికి అత్యంత ప్రీతికర మాసం మార్గశిర మాసం. ఈ మాసం రోజులు ఎంతో విశిష్టమైన విష్ణు సహస్రనామ పారాయణం చేసినట్లయితే సర్వసుఖాలు కల్గుతాయని ప్రతీతి. శ్రీమన్నారాయణుడు సాక్షాత్తు విష్ణు స్వరూపమని పురాణాలు చెబుతున్నాయి. విష్ణువు అంటే విశ్వమంతా నిండిన వాడని అర్థం. సర్వాంత ర్యామి అయినటువంటి విష్ణువును పూజించినట్లయితే కష్టాలు తొలగి శుభాలు కల్గుతాయని చెప్తుంటారు. విష్ణు సహస్రనామాలను పారాయణం చేయడం వలన సమస్త సద్గుణాలు, సదాచారాలు, రాజోపచారాలు, దైవోపచారాలు, వాహనాధరణాలు లభిస్తాయని పురాణ కథనం. ఓం నమో నారాయణాయ అనే అష్టాక్షరి మంత్రాన్ని పఠించడం వలన ఎంతోమేలు జరుగుతుంది. మంత్రపుష్పం అంతా విష్ణుమయం అని, విష్ణుభగవానుని విశేషాలు తెలిపేది విష్ణు సహస్రనామం అని పండితులు చెప్తుంటారు. శ్రీమన్నారాయణుడి శక్తిని, అనంతమైన స్వామి లీలలను తెలియజెప్పే సహస్రనామాలను స్తుతించడం ఎంతో శుభదాయకమన్నది విశ్వాసం. విష్ణుం విష్ణుర్వ షట్కారో... అంటూ ఆరంభం అయ్యే పారాయణం గురించి షిరిడీ సాయిబాబా సైతం భక్తులకు తెలిపి నట్లు సాయిసచ్చరితలో పేర్కొన్నారు.

మహాభారతంలో భీష్ముడు సైతం అంపశయ్యపై వున్నప్పుడు ధర్మరాజు తదితరులకు విష్ణు సహస్ర నామాన్ని స్తుతించి దాని గొప్పతనాన్ని తెలియజేశాడనేది తెలిసిన సంగతే. "అనాధి నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్ లోకాధ్యక్షం స్తువనిత్యం సర్వదు:ఖాతిగో భవేత్" అంటూ చేసే స్తోత్రంలో ఆది మధ్యాంతాలు లేనివాడు, వికార రహితుడు, బ్రహ్మాది దేవతలకు ప్రభువు, సర్వలోకాలకు అధిపతి అని అర్థం వుంది. అలాంటి విష్ణు సహస్రనామాలను అనునిత్యం స్మరించడం వలన కష్టాలు తొలగి సుఖ శాంతులు లభిస్తాయని పురాణాలు చెప్తున్నాయి. ఈ మాసంలో ప్రతిరోజు ఇంటిలోకాని, ఆలయంలోకాని, వ్యక్తిగతంగా లేదా సామూహికంగా సహస్రనామాలను పారాయణం చేయడం ముక్తి ఫలదాయకం.

డొక్కు బస్సుల పురి!

నెల్లూరు ఆర్టీసి రీజియన్‌లో తిరిగే బస్సులలో నానాపాట్లు పడుతున్నారు. గతవారంలో కనుపూరు కాల్వలో దూకి ఇక తిరగలేను బాబో అంటూ బాడీ ముంచేసింది. మామూలుగా ఆర్టీసిలో 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులను పనికిరాని విగా పరిగణిస్తారు. ఇకవాటిని రోడ్ల మీద తిరగనీయరు. కాని రీజియన్‌లో తిరిగే 705 ఆర్టీసి బస్సులలో 325 డొక్కుబస్సులు. లాభాలు ఇంకా ఇంకా రావాలన్న వుద్దేశ్యంతో అధికారులు వీటినే తిప్పుతూ జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇది భావ్యమా?

డొక్కు బస్సులు ఎక్కువైపోవడంతో జనం ఈ డొక్కు బస్సాకటి ఆమంచర్ల వద్ద



బొమ్మి గుండ్రంగా...



భూమి గుండ్రంగా తిరుగుతుందన్న సూత్రాన్ని మహాబాగా అర్థం చేసుకొన్నట్లున్నాడు శాసన మండలి సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి. మూడేళ్లక్రితం రాజకీయాల్లోకి వచ్చిన ఈయన తెలుగుదేశం పార్టీ సహకారంతో శాసనమండలి సభ్యుడయ్యారు. అనంతరం మెగాస్టార్ ప్రజారాజ్యం పార్టీ స్థాపించడంతో ఆ పార్టీలో చేరి జిల్లా కన్వీనర్ అవడంతోపాటు శాసనమండలిలో ఆ పార్టీకి తొలి సభ్యుడనని ప్రచారం కూడా చేసుకొన్నాడు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల తర్వాత వైఎస్‌కు దగ్గరయ్యారు. గతవారంలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీ సమావేశానికి అనుబంధ సభ్యుని హోదాలో వెళ్లడం జిల్లా వాసులను ఆశ్చర్యపర్చింది. మొత్తం మీద మూడేళ్లలో అన్ని ముఖ్యపార్టీలు తిరిగిన ఘనతను బొమ్మి స్వంతం చేసుకొన్నారు.



వారఫలాలు

తేది 05-12-2009 నుండి 11-12-2009 వరకు వృశ్చికంలో రవి, శుక్రులు; ధనస్సులో బుధ, రాహువులు; మకరంలో గురువు; కర్కాటకంలో కుజుడు; కన్యలో శని; మిథునంలో కేతువు; మిథున, కర్కాటక, సింహ, కన్యల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభముహూర్తాలు లేవు.

డిసెంబరు తిథులు
మార్గశిర బహుళ

5	శని	చవితి	రా.7.08	గం.ల.వ
6	ఆది	పంచమి	రా.6.33	గం.ల.వ
7	సోమ	షష్ఠి	రా.5.15	గం.ల.వ
8	మంగళ	సప్తమి	రా.3.19	గం.ల.వ
9	బుధ	అష్టమి	రా.12.55	గం.ల.వ
10	గురు	నవమి	తె.10.13	గం.ల.వ
11	శుక్ర	దశమి	తె.7.16	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు - 1.
E-mail:maripmgg@yahoo.com

మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ఈ రాశి వారికి రాబడి సామాన్యంగా ఉంటుంది. తప్పించుకోలేని అదనపు ఖర్చులుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ముందుకు సాగుతాయి. పిల్లల విద్య, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం జాగ్రత్త. వాహన ప్రమాదావకాశాలున్నాయి. కొత్త పరిచయాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తుల లావాదేవీలు నిర్ణయమౌతాయి.

వృషభం
కృత్తిక 2,3,4 పా, రోహిణి, మృగశిర 1,2 పా

ఆదాయం కంటే ఖర్చుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు తక్కువ. బంధువులు, సోదర వర్గాలతో సంబంధాలు సరిగా ఉండవు. పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలు జరిగి ప్రయోజనం చేకూరుతుంది. అనుకున్న పనులలో పోటీలు ఉంటాయి. ప్రయాణాలు ఫలవంతమవుతాయి. కొంత వరకు డబ్బు అందుతుంది. విద్యార్థులు పోటీలలో రాణిస్తారు.

మిథునం
మృగశిర 3,4 పా, ఆరుద్ర, పునర్వసు 1,2,3 పా

వృత్తి, వ్యాపార రంగాలలో ఆదాయం బాగుంటుంది. ధనాదాయవిషయంలో ఎలాంటి లోటు ఉండదు. కొత్త కాంట్రాక్టులు, వ్యాపార అవకాశాలు లభిస్తాయి. కొత్త పరిచయాలు ప్రయోజనం కల్గిస్తాయి. ఉద్యోగపరంగా అదనపు బాధ్యతలు పైన బడుతాయి. అధికారవర్గ సహకారంతో పనులు జరుగుతున్నా అప్పుడప్పుడు ఆందోళన ఉంటుంది. వివాహాది శుభకార్యాలకై ప్రయత్నాలుంటాయి.

కర్కాటకం
పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష

ఈ రాశి వారికి వృత్తి, వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. అయినా అవసరాల కోసం డబ్బు ఖర్చు చేస్తారు. ఆరోగ్య లోపంతో బాధపడతారు. సోదరులకు సాయమందిస్తారు. కుటుంబ సభ్యులతో విభేదాలొస్తాయి. కాని సర్దుబాటు అవుతాయి. రావలసిన బాకీల కోసం ప్రయత్నం చేస్తారు. రుణాలు ఇవ్వడం, హామీలివ్వడం చేయరాదు. రాజకీయులు జాగ్రత్తగా నడచుకోవాలి.

సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1 పా

ఆరోగ్య లోపం, అధికారులు, యజమానులతో చిక్కులుంటాయి. అదుపులేని ఖర్చులతో సంపాదన చాలదు. వృత్తి వ్యాపారాలలో పెరుగుదలకు అవకాశాలు సరిగా వుండవు. ఉద్యోగులకు బాధ్యతలు పెరగడం, పబ్లిక్‌తో, ప్రభుత్వంతో సమస్యలుంటాయి. అనవసర వివాదాలు, అపనిందలలో చిక్కులుంటాయి. అనుకున్న పనులు సరిగా జరగక ఇబ్బంది పడతారు.

కన్య
ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా

ఉద్యోగవర్గాలకు అదనపు బాధ్యతలుంటాయి. అధికారులు, యజమానులతో జాగ్రత్తగా మెలగాలి. అయినా లాభాదాయకంగా ఉంటుంది. భాగస్వాముల సలహాలు తీసుకోండి. వృత్తి, వ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ సభ్యుల వల్ల అదనపు ఖర్చులుంటాయి. ధనాదాయ విషయంలో లోపం ఉండదు. కొత్త ఆర్థిక ప్రయత్నాలు ఫలిస్తాయి.

తుల
చిత్త 3, 4 పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా

ఈ రాశి వారికి ఆర్థికంగా బాగుంటుంది. రాబడి పెరుగుతుంది. ఎదుటివారితో పరిమితంగా మెలగాలి. అవసరాల సంభాషణ చేసి తగాదాలు కొని తెచ్చుకునే అవకాశం ఉంది. అనుకోని కొంత ధనం చేతికి అందుతుంది. వృత్తి వ్యాపార రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. రావలసిన బాకీలు వసూలు అయ్యే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు అధికారుల వల్ల శ్రమ ఉంటుంది.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపార రంగంలో ఆదాయం తగ్గుతుంది. అవకాశాలు తప్పిపోతాయి. కుటుంబ ఆస్తి సమస్యల వల్ల ఇబ్బందులు ఉంటాయి. బంధువర్గంతో విభేదాలు చోటు చేసుకుంటాయి. అధికార, యాజమాన్య వర్గాల ఆదరణ, తోడ్పాటు బాగుంటుంది. ఉద్యోగులకు కోర్టు, ఆఫీసు వ్యవహారాలు బాధిస్తాయి. అదనపు బాధ్యతలు పైనబడతాయి. కొద్ది ఒత్తిడి ఉంటుంది.

ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. వృత్తి వ్యాపార రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. అధికారులు ప్రభుత్వం నుండి సహకారం పొందుతారు. వస్త్ర, వస్తు, ఆభరణాల కొనుగోలు ఉంటుంది. పాత బాకీలు వసూలయ్యే అవకాశాలున్నాయి. కొత్త పనులు ఊపందుకొంటాయి. సాంకేతిక ఉద్యోగావకాశాలుంటాయి.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

వృత్తి, వ్యాపారాలలో ఆదాయం బాగున్నా, అనుకోని ఖర్చులు పైనబడతాయి. ఇంటా బయటా కొంత సంయమనంతో మెలగాలి. లేకుంటే తగాదాలుంటాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలలో కొంత ఇరకాటం ఉండవచ్చు. అదనపు బాధ్యతలుంటాయి. బంధుమిత్రుల సహకారంతో నిర్ణయాలు తీసుకోవాలి. అతి ముఖ్యమైన పనులు వాయిదా వేసుకోవడం మంచిది.

కుంభం
ధనిష్ఠ 3,4 పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పా

ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబసభ్యుల అనుకూలత, పిల్లల విద్యా, ఉద్యోగ విషయాలలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆస్తి వ్యవహారాలలో అనుకూలత, వాహన మార్పులుంటాయి. వ్యాపార భాగస్వామ్య అవకాశం, కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఉద్యోగులకు అధికారులకు సహకారం, గుర్తింపు బాగుంటుంది. అవసరాలకు తగినట్లు ఆదాయం ఉంటుంది.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

ఆందోళన ఎక్కువగా ఉంటుంది. గడచినవారం కంటే ఈ వారం మేలు. ఆరోగ్యం కూడా సరిగా వుండదు. యంత్రాలు, కుటుంబంలో వ్యక్తులు అదుపు తప్పి ప్రవర్తించడం జరగవచ్చు. సోదర, బంధువర్గాలతో సంబంధాలు దెబ్బతింటాయి. ఆదాయం, ఖర్చు సమానంగా ఉంటాయి. ఉద్యోగులు కూడా అధికారులను గమనించుకోవాలి. లేకుంటే విభేదాలు తప్పవు.

ఈశాన్యంలో బావి... శాస్త్రీయ కారణాలు!

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డాక్టర్ జగదీష్ చెన్నై

* కలకత్తా వాస్తు సెమినార్‌లో డాక్టర్ పాండే ఈశాన్యంలో బావి సిద్ధాంతం కరెక్టేనంటారా?

ఈ అంశాన్ని 'హిందూ'లో చూశా. సిద్ధాంతం కరెక్టే. నైరుతి వాయుపీడనం ఈశాన్యంపై వుంటుంది. అందువల్ల బరువైన విషవాయువులు ఆవలివైపుకు నెట్టి వేయబడతాయి. గృహస్తుకు విషవాయువుల ముప్పుతప్పుతుంది.

నాగంవారి వినీత నెల్లూరు

* ఒకరి వాయువ్యం స్థలం ఆవల మరొకరి ఈశాన్యం స్థలం వస్తుందికదా? వాయువ్యం లెట్రిన్ ఈశాన్యానికి ముప్పుకదా?

చాలా మంది ప్రశ్న నైరుతి వాయు వత్తిడి వాయువ్యంపై వుండటం వల్ల లెట్రిన్ చెడుగాలులు వాయువ్యం నుంచి నెట్టివేయబడుతాయి. అందువల్ల ఈశాన్యం వాసులకు ఆరోగ్య భంగం వుండదు.

మాగుంట కావ్య ముంబై

* చైనా వాస్తు పాటిస్తున్నాము. లాభాలేవీ కనపడ్డం లేదు.

గాలి(ఫెంగ్), నీరు(ఫుయ్) చైనా వాస్తు ప్రధానాంశాలు. పంచభూతాత్మకమైనది భారతీయ వాస్తు. అందునా చైనా వాస్తుకు శాస్త్రీయ నిరూపణలు లేవు.

పైనేటి నాగరాజం చెన్నై

* నైరుతి నిర్మాణాలకు శాస్త్రీయ కారణాలేమిటి?

నైరుతి మిరు ప్రాంతం కాబట్టి తేమ నిలవక వైరస్, బాక్టీరియా వల్ల మాస్టర్ బెడ్‌రూంలోని యజమానులకు ఆరోగ్య భంగం వుండదు. ప్రక్కింటి ఈశాన్యం బావి, వెనుకింటి నిర్మాణానికి తగిలి విచ్ఛిన్నమై ఇతరదిశలకు మళ్లుతాయి.

పిన్నపి శారద విజయవాడ

* మా అమ్మాయికి పెళ్లవుతుందా? చాలా దిగులుగా వుంది?

నైరుతి వంటగదిని ఆగ్నేయానికి మార్చండి. ఈశాన్యంలో దేవుడి మండపాన్ని పశ్చిమ వాయువ్యానికి మార్చండి. వైధూర్యం(ఉచ్చ) కుడి చిటికెన వ్రేలికి ధరింపజేయండి. కుజ శత్రు స్థితి మే 28 వరకూ వుంది. శ్రావణంలో పెళ్లవుతుంది.

జి.వి.సత్యం నెల్లూరు

* నేను రిక్షాపుల్లర్‌ని. ఆరోగ్యాలకు ఢోకా లేదు. ఎంత దాచినా డబ్బులు దాగవు ఎందుచేత?

ఉత్తర, తూర్పు ఈశాన్య ద్వారాలు, తూర్పు వాస్తు ఆరోగ్యపరంగా రక్షిస్తున్నాయి. ఉత్తర దిశలోపాలు ఎనిమిది మిమ్మల్ని ఆర్థికంగా పీడిస్తున్నాయి. అద్రసురాస్తే పరిష్కారాలు రాస్తాను.

దోనిపాటి విల్సన్ నెల్లూరు

* వ్యాపారంలో నష్టాల్ని పూడ్చుకోవాలి. నా ఆరోగ్యం బాగుపడాలి నేనేం చేయాలి?

మీరు పశ్చిమ గృహం, ఉత్తరం షాపులో నివాసం, వ్యాపారం చేయాలి. పచ్చ(ద్వితీయ) ధరించాలి. వాస్తు యంత్రం(ప్రధమార్థ) గృహం దేవుడి గదిలో ప్రతిష్ఠించాలి.

షేక్ సులేమాన్ గూడూరు

* గృహ నిర్మాణం తర్వాత పరిస్థితి తారుమారయింది?

గృహ నిర్మాణమప్పుడే జాగ్రత్త పడివుంటే ఇప్పుడిలా అయ్యేదికాదు. ఈశాన్యం బాత్రూం తీసి పశ్చిమ వాయువ్యంలో నిర్మించండి. 'సెల్లార్' ఈశాన్యం(ఉచ్చ)లో తీసివేసి తూర్పు సగంలో పెట్టండి.

డాక్టర్ మైత్రేయి చెన్నై

* బెంగుళూరు వాస్తు సభలు విజ్ఞానదాయకంగా జరిగాయి. అయితే శాస్త్రీయదృష్టిని నిరూపించలేకపోయాయి.

వాస్తు శాస్త్రీయతను అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అంగీకరించిన విషయాన్ని డాక్టర్ కేదారినాథ్ కూలంకషంగా వివరించారు. మీరు గమనించినట్లు లేదు.

కొడవలూరును కమ్ముకొన్న సమస్యలు!

కొడవలూరు గ్రామ పంచాయితీ సమస్యలతో సతమతమవుతున్నది. మేజర్ పంచాయితీగా పరిగణింపబడుతున్న ఈ పంచాయితీకి ప్రభుత్వం వైపు నుంచి ఆశించిన మేర నిధులు మంజూరు కాకపోవడం వలన అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నారు. పంచాయితీ పరిధిలోని గ్రామాలలో అంతర్గత రోడ్లు, మురికి కాల్వలు చాలా అధ్వాన్నంగా వున్నాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా నడవలేని పరిస్థితి ఏర్పడి వుంది. ప్రభుత్వం నుంచి వస్తున్న కొద్దిపాటి నిధులు వీధిలైట్ల కొనుగోలు, కాంట్రాక్టు సిబ్బంది జీతభత్యాలకు సరిపోతున్నాయి. కొడవలూరు గ్రామ పంచాయితీ పరిధిలో వెయ్యి కుటుంబాలు, 4,170 మంది జనాభా, 3వేల మంది ఓటర్లు వున్నారు. పంచాయితీకి పన్నుల రూపంలో సంవత్సరానికి 3 లక్షల రూపాయలు వసూలు కావాల్సి వుండగా కేవలం 70 శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. సెస్సుల రూపంలో మరో లక్షా 50 వేల రూపాయలు పంచాయితీకి అదనపు రాబడి వుంది. ఇవి కాకుండా ఎస్ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు మరో రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో వస్తున్నాయి. గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఒట్టూరు సునీత ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పాలకవర్గంలో మెజార్టీ సభ్యులు కాంగ్రెస్‌పార్టీకి చెందినవారే వున్నారు. మొత్తం 12 వార్డులకు గాను కాంగ్రెస్-7, తెలుగుదేశం-4, సిపిఎం ఒకరు వున్నారు. అభివృద్ధి పనుల విషయంలో గ్రామపంచాయితీ పాలకవర్గం దృష్టి కేంద్రీకరించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ పంచాయితీ పరిధిలో మీనమ్మగుంట, ఎన్టీఆర్‌కాలనీ, మూలకట్ట సంఘం తదితర గిరిజన కాలనీలు వున్నాయి. వీటిలో



కొడవలూరు గ్రామ పంచాయితీ కార్యాలయం.

రాజుపాళెం జాతీయ రహదారి సమీపంలో వున్న మీనమ్మగుంటలో వర్షం వస్తే మూడు అడుగుల లోతున నీరు చేరిపోతుంది. ప్రతి సంవత్సరం కురిసే భారీవర్షాలకు ఇక్కడి గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.



అభివృద్ధికి కృషి!

గ్రామ పంచాయితీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధికి అన్నివిధాల కృషిచేయడం జరుగుతోంది. అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి వుంది. పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

– **వి.శివశంకర్**, పంచాయితీ కార్యదర్శి



వర్షం వస్తే నీటిలోనే!

కొద్దిపాటి వర్షం కురిసినా మా కాలనీలో నీరు చేరిపోయి వీధులలో నడవలేని దుస్థితి కలుగుతోంది. పంచాయితీ అధికారులకు, ఇతర నాయకులకు అనేక దఫాలు విన్నవించుకున్నా కాలనీ గురించి పట్టించుకున్న దిక్కులేదు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి కాలనీలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి.

– **వీచయ్య**, స్థానికుడు

అవినీతి కథ

భూమి అభివృద్ధి పథకం నిధుల స్వాహా!

బంజరు, సిజెఎఫ్ఎస్ భూముల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు జిల్లాలో ఒకపథకం ప్రకారం స్వాహా అవుతున్నాయి.



అవినీతి అక్రమాలకు నిలయమైన జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయం.

ఉన్నతాధికారుల వుదాసీనత, లబ్దిదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది సంఘ బంధం లీడర్లు నిధుల స్వాహా చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించి బంజరు భూములు, సిజెఎఫ్ఎస్ భూములు అభివృద్ధి చేస్తున్నాయి. ఎన్నో సంవత్సరాల నుంచి వీడు భూములుగా వుండి దేనికీపనికిరాని భూములను అభివృద్ధి చేసి తోటల పెంపకానికి శ్రీకారం చుట్టాయి. ఇందుకు అవసరమైన అన్ని వసతులను లబ్దిదారులకు కల్పిస్తున్నా ఫలితాలు మాత్రం రావడం లేదు. ఇందుకు ఉదాహరణగా నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి గ్రామాన్ని చెప్పొచ్చు. 2004 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బంజరు భూముల అభివృద్ధి కోసం ఇందిరప్రభ పేరుతో పథకాన్ని ప్రారంభించింది. ఎకరాకు 10వేల రూపాయల వంతున ఖర్చు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ పథకం అమలు బాధ్యతలను జిల్లా నీటి యాజమాన్య సంస్థకు అప్పగించడం జరిగింది. కొమ్మరపూడి గ్రామంలో 60 ఎకరాలను 120 మంది లబ్దిదారులకు కేటాయించడం జరిగింది. ఈ భూములను అభివృద్ధిపరచి మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా నీటి సౌకర్యాన్ని కూడా కల్పించారు. నిధుల ఖర్చుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ గ్రామ సంఘబంధం లీడర్లకు అధికారులు అప్పగించారు. నిధులు మంజూరు చేసిన అధికారులు వాటి జమాఖర్చుల వివరాల గురించి పట్టించుకోవడం మానేశారు. మండలస్థాయి టెక్నికల్ అసిస్టెంటు సంఘ బంధం లీడర్లతో కుమ్మక్కై విచ్చలవిడిగా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. గ్రామంలోని లబ్దిదారులు నిరక్షరాస్యులు కావడం కూడా వారికి బాగా కలిసి వచ్చింది. లబ్దిదారులకు ఎటువంటి సమాచారం లేకుండానే బ్యాంకు నుంచి నిధులు డ్రా చేసి స్వాహా చేశారు. కొమ్మరపూడి గ్రామ సమీపంలో వున్న ఈ భూములలో ఇందిరప్రభ, మైక్రోఇరిగేషన్ పథకాలలో బత్తాయి మొక్కలను కొనుగోలు చేసి నాటారు. వాటికి సక్రమంగా నీరందకపోవడంతో కొన్ని మొక్కలు ఎండిపోయి అధికారులు, డ్రిప్ ఇరిగేషన్ ప్రతినిధులను ఎక్కిరిస్తున్నాయి. సంఘ బంధం ఆధ్వర్యంలో నిధుల ఖర్చు జరగడంతో అధికారులు మంజూరు చేసిన నిధులలో దాదాపు లక్షా 50వేల రూపాయలుపైగా దుర్వినియోగం జరిగింది. ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారన్న దానిపై గ్రామంలో మల్లగుల్లాలు పడుతున్నారు. పథకాలు మంజూరు చేస్తున్న అధికారులు తర్వాత వాటి గురించి పర్యవేక్షణ చేయకపోవడంతో నిధులు పక్కదారి పడుతున్నాయి. లబ్దిదారులకు కేటాయించిన భూములలో ఎటువంటి పనులు చేపట్టారు? ఎంతమంది కూలీలు పనిచేశారు? ఎంత ఇస్తున్నారు అన్న పూర్తి వివరాలు చాలా గోప్యంగా వుంచుతున్నారు. మండల టెక్నికల్ అసిస్టెంటు సూచనల మేరకే సంఘ బంధం సభ్యులు నగదు డ్రా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసిన చందంగా కొమ్మరపూడి గ్రామంలో ప్రభుత్వ నిధుల్ని సంఘబంధం లీడర్లు వాడుకొంటున్నారు. గ్రామంలో సంఘబంధం సభ్యుల మధ్య అభిప్రాయభేదాలు రావడంతో ఈ నిధుల దుర్వినియోగ విషయం బయటకు పొక్కింది. ఈ సంఘటన అధికారుల దృష్టికి వెళ్లినా కూడా బాధ్యులపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

యువతను ఆకట్టుకొనే 'ఆర్య-2'

అల్లూరు రమేం

గతంలో హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో హిట్ అయిన ఆర్య చిత్రానికి స్వీకెలనే ఆర్య-2. అయితే పాత చిత్రంలో కొన్ని పాత్రల పేర్లు కొత్త చిత్రంలో పెట్టడం తప్ప ఆ కథకు, ఈ చిత్రకథకు అసలు సంబంధమే లేదు. ఆర్య చిత్రం తర్వాత తాను తీసిన జగడం ఫ్లాప్ కావడంతో దర్శకుడు సుకుమార్ చాలా సమయం తీసుకొని మనసంతా కేంద్రీకరించి ఆర్య-2ను తీశాడనాలి. ఈ చిత్రం నేటి యువతను మహాబాగా ఆకర్షిస్తుంది. హీరో అర్జున్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ సినిమాలో పాటలకు కష్టపడి నృత్యం చేయడంతో పాటు స్టైలిష్‌గా నటించాడు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కమాన్ కమాన్, నా ఊపిరి ఆగిపోయినా, రింగరింగా చరణాలతో సాగే పాటలకు వీనుల విందైన సంగీత మందించాడు. హీరోయిన్ కాజల్‌కు మగధీర చిత్రం తర్వాత యువతీ యువకుల్లో మంచి ఫాలోయింగ్ వచ్చింది. ఆ దిశగానే ఈ చిత్రంలోని పలు సన్నివేశాల్లో ఆమెను ముగ్ధమనోహరంగా చూపించను దర్శకుడు సుకుమార్ తనవంతు కృషిచేశాడు. శ్రద్ధాదాస్, ఐటంగర్ల్ ఇరీనా కూడా యువత విపరీతంగా ఆకర్షించేలా దేహప్రదర్శన చేశారు. హీరోయిన్ కాజల్‌కు హీరో అల్లుఅర్జున్ డైరెక్ట్‌గా ముద్దిస్తాడు. ఈ సీన్ చాలా స్పీడుగా సాగిపోతుంది. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేసే వుద్యోగుల మధ్య అన్యోన్నతపై రచయిత వేమారెడ్డి వ్రాసిన పలు డైలాగులను సెన్సార్ కట్ చేసింది. ఫ్రెండ్స్‌ను నమ్మబాకు... ముంచుతారు, ప్రేమ పుట్టాలంటే ఒక నిమిషం చాలు, ఎవరికైనా ఒక విషాదం తప్పనిసరి డైలాగులు ఆలోచింపజేస్తాయి. డాక్టర్ దశావతారంగా బ్రహ్మానందం, ముసుగు కారుతో నవదీప్ చేసే కామెడీ బాగుంది. ప్రథమార్ధ మంత బిగువుగా ద్వితీయార్ధంలో కథనం నడవకపోవడంతోపాటు రోటీన్ రాయలసీమ ఫ్యాక్షనిజం దర్శనమిస్తుంది. ప్రేక్షకులను నీరస పరుస్తుంది. ప్రేమ్‌రక్షిత్ కూర్చిన నృత్యభంగిమలు, రాజశేఖర్ కెమెరా గూర్చి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కథ దర్శకుడు సుకుమార్‌దేనైనా, స్క్రీన్‌ప్లే టి.ప్రకాష్‌తో వ్రాయించడం వల్ల అక్కడక్కడ సినిమా పట్టు తప్పిందనాలి.



చిత్ర సమీక్ష

ఇక చిత్రకథలోనికి వెళ్తే ఆర్య (అర్జున్), అజయ్ (నవదీప్) అనాథలు. మధర్ థెరిస్సా ఆశ్రమంలో వుంటారు. ఆర్య, అజయ్ ఎటువంటి మిత్రులంటే ఆర్య లాంటి ఫ్రెండ్ వుంటే వేరే శత్రువులక్కరలేదని అజయ్ మనసులో భావిస్తుంటాడు. కాని తప్పనిసరి పరిస్థితులలో అతని స్నేహితునిగా కొనసాగుతుంటాడు. డబ్బున్నవారు అజయ్‌ను దత్తత తీసుకవెళ్లడంతో అతనో స్టాఫ్‌వేర్ కంపెనీ అధినేత అవుతాడు. తాను త్యాగం చేయడం వల్ల అజయ్‌కు ఆ అదృష్టం పట్టిందని ఆర్య అతని కంపెనీలోనే వుద్యోగిగా చేరుతాడు. ఆర్య వ్యక్తిత్వపరంగా మిస్టర్‌వరెస్ట్. కాని కంపెనీలో బహుబాగా నటించి మిస్టర్ పర్ఫెక్ట్‌గా అవార్డును కూడా తెచ్చుకొంటాడు. ఈ కంపెనీలో వుద్యోగంలో చేరే గీత (కాజల్)ను తొలి చూపులోనే అజయ్ ప్రేమిస్తాడు. కాని ఆర్య వుయ్ లవ్ హర్ అన్ని మిత్రుడ్ని ఊరిస్తాడు. ఒకసారి లిఫ్ట్‌లో ఆర్య గీతకు ముద్దిస్తాడు. ఆమె ఆ విషయాన్ని కంపెనీ మేనేజర్ డాక్టర్ దశావతారం (బ్రహ్మానందం), సహోద్యోగి శాంతి (శ్రద్ధాదాస్)కు చెప్పినా నమ్మరు. దీంతో ఆమె అజయ్‌తో ఆర్య అల్లరి చెప్పుకొని అతనికి దగ్గరవుతుంది. అజయ్, గీత పెళ్లి చేసుకోవాలనుకొంటారు. ఈ విషయాన్ని ఆర్య గీత తండ్రి కర్నూల్‌లో ఫ్యాక్షనిస్ట్ రాజిరెడ్డి (ముఖేష్‌రుషి)కి ఫోన్ చేసి చెబుతాడు. వాళ్లు రాత్రికి రాత్రే ఆమెను కర్నూలు తీసుకెళ్లిపోతారు. అజయ్ ప్రేమను నిలబెడతానని కర్నూలు వెళ్లిన ఆర్య, రాజిరెడ్డికి తాను గీత మాజీ లవర్‌నని చెప్పుకొంటాడు. కర్నూల్‌లో ఫ్యాక్షనిజం అంతంచేయాలని రాజిరెడ్డి, గీతను మరో ఫ్యాక్షనిస్ట్ కాశిరెడ్డి (సాయాజిషిండే) కుమారుడు సుబ్బిరెడ్డి (అజయ్)కు ఇచ్చి పెళ్లి చేయాలనుకొంటాడు. పెళ్లిలో కాశిరెడ్డి పలు అవమానాలకు గురి చేయడంతో మార్గాంతరం లేక ఆర్యతో గీత వివాహం చేస్తాడు. అక్కడ నుంచి కథ మలుపులు తిరుగుతుంది. అజయ్ ఈ విషయమై ఆర్యను ప్రశ్నిస్తాడు. ఆర్య - అజయ్, గీతలను విదేశాలకు పారిపొమ్మని సలహా యిస్తాడు. చివరి సన్నివేశంలో అజయ్ అలివిమాలిన స్వార్థాన్ని ప్రదర్శించడం గీతకు నచ్చదు. ఆమెకు ఆ క్షణంలో ఆర్యపై ప్రేమ పుట్టడం, చిత్రం ముగియడం జరిగిపోతుంది.

శృతి చేసుకుంటుందా?



హాసన్ చిత్రం ద్వారా తన కుమార్తె శృతిహాసన్‌ను బాలీవుడ్‌కు పరిచయం చేసిన కమలహాసన్ తెలుగులోనూ అదేబాట అనుసరించాడు. శృతి తెలుగులో సిద్ధార్థ సరసన హీరోయిన్‌గా నటించనుంది. ఈ ఇద్దరు టాలెంటెడ్ ఆర్టిస్టుల కాంబినేషన్ అదరగొడుతుందని, ఇద్దరికిద్దరు పోటాపోటీగా నటించి ప్రేక్షకుల్ని మెప్పిస్తారని చిత్రపరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఓ వైవిధ్యభరితమైన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకుడు రాఘవేంద్రరావు తనయుడు ప్రకాశ రావు నిర్మాత. మిక్కీ జె.మేయర్ సంగీత దర్శకుడు.

నాట్యంతో నాజూకుతనం



ఎవరైనా ఎపుడైనా, చుక్కలాంటి అమ్మాయి చక్కనైన అబ్బాయి చిత్రాల్లో హీరోయిన్ విమలారామన్ అందగత్తె. తన అందమైన శరీర సౌష్టవం వెనుక రహస్యాన్ని వివరించింది. చిన్నతనం నుంచి ప్రతిరోజు క్రమం తప్పకుండా నాట్యం చేస్తాను. ఇప్పటికీ జిమ్‌లకు వెళ్లే కంటే నాట్యం చేయటానికి మొగ్గు చూపిస్తాను. నాట్యాన్ని ప్రతిరోజూ అభ్యసించడం వల్ల మానసిక సంతృప్తితోపాటు శరీరం కూడా పటిష్టమవుతుందంది విమల.

బికినీలు వేయను



అరుంధతి చిత్ర విజయం హీరోయిన్ అనుష్క జాతకాన్నే మార్చేసింది. ప్రస్తుతం తమిళ అగ్రహీరోలు సూర్య, విజయ్‌ల సరసన నటిస్తుంది. తెలుగులోనూ ఆమె చేతిలో అర డజనుకు పైగా చిత్రాలున్నాయి. హిందీ పరిశ్రమ నుంచి ఆమెకు పిలుపు లొస్తున్నాయి. బిల్లా చిత్రంలో తప్పదు కాబట్టి బికినీ ధరించాను. భవిష్యత్తులో ఇటువంటి పనిచేయను. తమిళంలో సైతం అనర్గళంగా మాట్లాడను ట్రైనింగ్ తీసుకొంటున్నాను. హిందీ చిత్రాల్లో నటించే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదంది ఈ కన్నడ భామ.

నమిత సహజీవనం



సినీ పరిశ్రమలో సహజీవనం అనేది సర్వసాధారణమైపోయింది. కమల్ హాసన్, గౌతమిలు సహజీవనం చేస్తున్నారు. గతంలో సహజీవనం చేసిన రేణూ దేశాయ్, పవన్‌కళ్యాణ్‌లు పెళ్లి చేసుకొన్నారు. ప్రభుదేవా, నయనతారలు సహజీవనం బాటలో వున్నారు. ఇది ఇలావుండగా సినీ పరిశ్రమలో సహజీవనం చేసే వారిలో ఒక వైవిధ్యభరితమైన జంట వెలుగులోకి వచ్చింది. అది మరెవరో కాదు. అలనాటి నటుడు శరత్‌బాబు, అందాల భామ నమిత. వీరిద్దరు చెన్నైలో సహజీవనం సాగిస్తున్నారు. విచిత్రంగా అనిపిస్తోంది కదూ... కానీ విషయం మాత్రం వాస్తవం.



నెల్లూరు వెంకటేశ్వరపురం హైస్కూల్‌లో చెట్ల క్రింద విద్యార్థులకు పాఠాలు.

నిలిచిన పాఠశాల గదుల నిర్మాణం

అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా వుంది వెంకటేశ్వరపురంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి. ఏడువందల మంది పిల్లలు చదువుకొంటున్న ఈ పాఠశాలలో తరగతి గదులను నిర్మించేందుకు సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్‌లో 13 లక్షల రూపాయలను మంజూరు చేశారు. రాజకీయ గ్రహణం పట్టడంతో గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలచిపోయింది. దీంతో పిల్లలు చెట్ల క్రిందనే చదువుకోవాల్సి వస్తోంది. 1, 50 డివిజన్ల పరిధిలోకి వచ్చే ఈ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఇంతగా అవస్థలు పడడానికి కారణం రాజకీయ వివాదాలనేది జగమెరిగిన సత్యం. స్థానిక కార్పొరేటర్ టిడిపికి చెందినవారు కావడం, రూరల్ శాసనసభ్యునికి, వీరికి రాజకీయ విభేదాలు నెలకొని వుండడంతో కావాలనే పాఠశాల గదుల నిర్మాణాలు నిలిపివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయాలు వుంటే వ్యక్తిగతంగా చూసుకోవాలే కానీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటంపై పిల్లల తల్లితండ్రులు మండిపడుతున్నారు. గదుల నిర్మాణం కోసం వున్న మరుగుదొడ్లను సైతం పడగొట్టడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మేయర్ అండతో మరో భూకబ్జా

- స్థలం విలువ కోటి 20 లక్షలు



నెల్లూరు గాంధీనగర్‌లో మేయర్ అనుచరులు దురాక్రమించిన మునిసిపల్ రిజర్వ్ స్థలం.

మునిసిపల్ స్థలాలను ఆక్రమించడం నగరంలో ఒక రివాజుగా మారింది. నాయకుల అండదండలు వుంటే ఏ స్థలమైనాసరే చిటికెలో ఆక్రమణలకు గురౌతున్నాయి. స్మశాన స్థలమైనా, నివేశన స్థలమైనా, పట్టా భూమైనా, కాలువగట్టినా ఇట్టే ఆక్రమించి భవనాలు నిర్మించేస్తున్నారు. అందులోనూ మేయర్ భానుశ్రీ అండదండలతో ఆక్రమణదారులు మరీ బరితెగించి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితులలో గాంధీనగర్ వద్ద గల 120 అంకణాల మునిసిపల్ స్థలాన్ని ఆదివారం ఆక్రమించి గదులు నిర్మించేందుకు కొందరు చోటాలు ముందుకు రావడంతో గందరగోళం నెలకొనింది. భానుశ్రీ బంధువైన వర్మ రాంబాబు, శివాచారి అనే కొందరు ఆనం అనుచరులుగా చెప్పుకొనే కాంగ్రెస్ చోటా నేతలు ఈ ఆక్రమణలకు పూనుకోవడంతో స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ రావుల జ్యోతి, డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తదితరులు దీనిని అడ్డుకొన్నారు. కోటి 20 లక్షల రూపాయలు విలువ గల ఈ స్థలాన్ని ఎలాగైనా ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్నారట. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్ సిబ్బంది నిద్ర పోతుండడం విమర్శలకు తావిస్తోంది.

చైనా ఫోన్ల మూగనోము

లబోదిబో మంటున్న వినియోగదారులు



పనిచేయని చైనా ఫోన్లు.

ఆకర్షణీయంగా వుండడంతోపాటు కారుచౌకగా వస్తున్నాయని ఆశపడి చైనా ఫోన్లు కొనుగోలు చేసిన మొబైల్‌ఫోన్ వినియోగదారులకు ఇపుడు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. ఇంటర్నేషనల్ మొబైల్ ఎంక్వయిరీ ఐడెంటిటీ(ఐఎంఇఐ) నెంబర్ లేకపోతే ఫోన్లు పనిచేయవని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా లక్షలమంది వినియోగదారులకు చిక్కొచ్చి పడింది. ఉగ్రవాదుల కదలికలు, శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫోన్ వినియోగంపై నిబంధనలు కఠినతరం చేసింది. అందులో భాగంగా ఏప్రిల్ నెలలోనే ఐఎంఇఐ నెంబర్ తప్పనిసరిగా ఫోన్లకు వుండాలని, అలాలేని ఫోన్లను రద్దుచేస్తామని ప్రకటించింది. ఈ ఆదేశాలు అమలు చేసేందుకు కొంత ఆలస్యం కావడంతో డిసెంబర్ నెల నుంచి వీటి అమలుకు నడుం బిగించింది. దీంతో చైనా ఫోన్లు వాడే వినియోగదారుల పరిస్థితి ఇరకాటంలో పడింది. నగరంలోనే 30వేల మంది చైనా ఫోన్లు వాడుతున్నారంటే అవి ఎంతగా ఆకట్టుకొన్నాయో తెలుస్తుంది. ప్రభుత్వ నిబంధనలను తమకు అనుకూలంగా మలచుకొనేందుకు కొందరు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వినియోగించి 15 అంకెల నెంబర్‌ను ఫోన్లలోకి ఎక్కించినట్లు గుర్తించిన ప్రభుత్వం ఆ ఐఎంఇఐ నెంబరు సరైనదా, కాదా అనేది తెలుసుకొనేందుకు కొన్ని సూచనలు చేయడంతో జిల్లాలో నవంబర్ 27వ తేది నుండే పలు ఫోన్లు మూగనోము పట్టాయి.

కుదువకు రేషన్‌కార్డులు

నగరంలో సరికొత్త వ్యాపారం!

పేదల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకొని ధనవంతులు వడ్డీ రూపంలో పెద్ద మొత్తాలను గుంజడం తెలిసిన సంగతే. వడ్డీ వ్యాపారులకు ఇప్పుడు రేషన్‌కార్డులు మంచి ఆదాయ వనరులుగా మారాయి. పేదల తెల్లరేషన్ కార్డులను కుదువకు పెట్టుకొని వారికి డబ్బులు అప్పుగా అందజేయడం శివారు ప్రాంతాలలో జోరుగా జరుగుతున్న తంతు. పది రూపాయలు, ఇరవై రూపాయల వడ్డీకి డబ్బులు అప్పు ఇచ్చే వ్యాపారులు రేషన్‌కార్డులను తమ వద్ద కుదువ వుంచుకొంటారు. అప్పు తీసుకొన్నవాళ్లు తిరిగి డబ్బులు చెల్లించే వరకు తెల్లరేషన్ కార్డులపై అందించే బియ్యం, కిరోసిన్, తదితర సరుకులను తాము కొనుగోలు చేసి వాటిని బ్లాక్‌లో విక్రయించి రెండు రకాలుగా లబ్ధిపొందుతున్నారు. దీని కోసం వీరు ఇళ్లలోనే లావాదేవీలు జరుపుతున్నారు. కొందరు రేషన్‌షాపు నిర్వాహకులు ఈ పనులకు పాల్పడుతున్నారట.



తాకట్టులో రేషన్‌కార్డులు.

డిఎస్ఆర్ స్క్వేర్‌కు భూమిపూజ

హరనాధపురంలో అత్యాధునిక అపార్ట్‌మెంట్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మేయర్ భానుశ్రీ, నగర ఎమెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి.

నెల్లూరు హరనాధపురంలోని శ్రీకృష్ణా అవెన్యూలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ శ్రీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నూతనంగా నిర్మిస్తున్న డిఎస్ఆర్ స్క్వేర్ లగ్జరీ అపార్టుమెంట్ భూమిపూజ 27వ తేది అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ భానుశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో పేరుగాంచిన శ్రీకన్‌స్ట్రక్షన్స్ నెల్లూరు ప్రజలకు చక్కని అపార్టుమెంట్‌లను అందించడానికి ముందుకు రావడం ముదావహమన్నారు. శ్రీకన్‌స్ట్రక్షన్స్ అధినేత రమేష్ పెరమన మాట్లాడుతూ ఇప్పటికే తాము అన్ని మెగా నగరాల్లో నాణ్యమైన అపార్టుమెంట్లు నిర్మించి ప్రజల నమ్మకాన్ని పొందామని, హరనాధపురంలో నిర్మిస్తున్న డిఎస్ఆర్ స్క్వేర్‌లో అత్యాధునిక వసతులతోపాటు 100 శాతం వాస్తు, జీరో శాతం డివియేషన్, వాకింగ్ ట్రాక్, వాటర్ ప్యూరిఫయర్, వాటర్ సాఫ్ట్‌నర్, చిన్నపిల్లల ఆటస్థలం, జిమ్ తదితర వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చెయ్యి దాటింది

మొదటి పేజీ కొరవ

చేసుకోలేకపోయింది. అది తాటాకు మంట వంటిదని భ్రమపడింది. కానీ నిజం అది కాదు. కెసిఆర్ దీక్షను ఆసరాగా చేసుకొని కోల్పోయిన తమ ఉనికిని ప్రతికించుకోవడానికి పిడిఎస్యు, ఆర్ఎస్యు వంటి సంస్థలు లోలోపల పకడ్బందీ ప్రణాళికలు వేసుకొన్నారని వారికి తెలియదు. దానితో విద్యార్థుల మీద దుందుడుకుగా దౌర్జన్యానికి దిగారు. నాలుగు దెబ్బలు గట్టిగా తగిలితే విద్యార్థులు పారిపోతారని భావించారు. అయితే అందుకు విరుద్ధంగా జరిగింది. విద్యార్థుల మీద పోలీసులు దుష్ట కర్రలతో దాడి చేయడం టివి ఛానళ్లలో చూసిన ప్రజా సంఘాలు, మేధావి వర్గాలు తీవ్రంగా స్పందించాయి. తెలంగాణా మొత్తం మీద విద్యార్థిలోకాన్ని ఆ దృశ్యాలు బాధ పెట్టాయి. వారిలో ఆవేశం రగిలించింది. తెలంగాణా అంటే చులకన అయిపోయిందన్న భావన వారిలో కల్గింది. దానితో అన్ని విశ్వవిద్యాలయాల ఆవరణలు నిరసనలతో ప్రతిధ్వనిస్తున్నాయి. డిగ్రీ కాలేజీలకు కూడా ఈ మంట అంటుకొన్నది.

ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంబిఏ, ఎంసిఏ వంటి చదువులలో వుండేవారు ఈ ఉద్యమాలలో పాల్గొనడంలేదు. సాధారణ డిగ్రీలు, న్యాయవిద్య అభ్యసించే విద్యార్థులలోనే ఎక్కువ కదలిక వుంది. ఆర్థిక మాంద్యం వల్ల ఈ కోవకు చెందిన యువతీ యువకులలో తమ భవిష్యత్తు పట్ల ఇదివరకటి ఆశ లేదు. నమ్మకం లేదు. ఉద్యోగాలు దొరకడం కష్టమన్న భయం వారిలో బలంగా వేళ్లూనుకొంటున్నది. ఆ అసహనంతో వారు వీధులలోకి వస్తున్నారు. దాదాపు ఇరవైఏళ్లుగా రాజకీయాలకు, ఉద్యమాలకు దూరంగా వున్న విద్యార్థి లోకం ఒక్కసారిగా వీధులలోకి వస్తున్నది. విద్యార్థులు తోక్యం చేసుకొంటే ఏ ప్రజా ఉద్యమమైనా ఎంత పతాకస్థాయికి చేరుకుంటుందో చెప్పనవసరం లేదు. గతానుభవాలు చాలానే వున్నాయి అందుకు.

మావోయిస్టు ప్రాబల్యం

ఇప్పుడు తెలంగాణా ఉద్యమం కెసిఆర్ చేతిలో లేదు. టిఆర్ఎస్ నాయకత్వంలో లేదు. అది పూర్తిగా చెయ్యిదాటి పోయింది. మావోయిస్టులు తెరవెనుక నుంచి దాన్ని తమ హస్తగతం చేసుకొన్నారు. విద్యార్థులను ముందు పెట్టి వెనుక నుంచి నాటకం నడిపించడానికి సన్నద్ధమౌతున్నారు. చాలా ప్రమాదకర పరిణామం ఇది. ఆరు నెలల క్రితం వరకు కెసిఆర్ మాటలు, చేష్టలు మాత్రమే తెలంగాణా ఉద్యమ సంకేతాలు. ఆయన నోరు విప్పితే ఉద్యమం, మూస్తే నిశ్శబ్దం. కానీ ఇప్పుడు ఆయన అదే ఉద్యమానికి సంకేతమే తప్ప, సూత్రధారి కాదు. ఆయన వద్దు అంటే ఉద్యమం ఆగే పరిస్థితి లేదు.

కెసిఆర్ దగ్గర ఒక సుగుణం వుంది. తన ఉద్యమాన్ని ఏ స్థాయిలోనూ హింస వైపు మళ్లకుండా జాగ్రత్తపడేవాడు. వీధి పోరాటాలకు ఆయన విముఖుడు. రాజకీయ బేరసారాలు, ఎత్తులు, వ్యూహాలతోనే ఉద్యమాన్ని నడిపించడం ఆయన తత్వం. కానీ ఇప్పుడు పరిస్థితి అది కాదు. విద్యార్థులు, మావోయిస్టు సానుభూతి సంస్థల ప్రమేయంతో తెలంగాణా ఉద్యమం వీధి పోరాటంగా మారిపోయింది. బస్సు దహనాలు, అల్లర్లు, దాడులు, విధ్వంసాలతో అట్టుడికి పోతున్నది. ఈ అల్లరి నిలువరించడం ప్రభుత్వానికి చాలా పెద్ద సవాలు. ముఖ్యమంత్రి రోశయ్య అంత భారం మోయగలడో లేదో వేచి చూడాలి.



ఒంగోలులో జరిగిన స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సభలో ఆయన చిత్రపటం ముందు అంజలి ఘటిస్తున్న మాగుంట పార్వతమ్మ, ఒంగోలు ఎమ్పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి.

మేయర్ మీద దర్యాప్తు

15వ పేజీ కొరవ

మంత్రి కాబట్టి, దర్యాప్తుకు వచ్చే అధికారుల మీద రామనారా యణరెడ్డి తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి, నివేదిక తనకు అనుకూలంగా ఇప్పించుకోవడానికి ప్రయత్నించడం సహజం. మరొకప్రక్క దర్యాప్తు అధికారులకు కనకాభిషేకం చేసి, ప్రలోభ పెట్టగల్గిన స్థాయిలో భానుశ్రీ ఆర్థిక స్థోమత పెరిగిపోయిందన్నదీ నిజం. ఆ విషయంలో పాపం వీధ కమ్యూనిస్టులు ఆమెతో పోటీ పడలేరు.

ముఖ్యమంత్రి రోశయ్య గారు చెల్లూరు కార్పొరేషన్లో అదుపు తప్పిన అవినీతి, దోపిడీ తత్వాలను సమగ్రంగా అవగాహన చేసుకొన్నట్లు తెలుస్తున్నది. అధికారులు ఆయన మనసెరిగి ప్రవర్తిస్తే మాత్రం ఈ దర్యాప్తు నివేదిక భానుశ్రీ రాజకీయ జీవితానికి మరణ శాసనం కావడం ఖాయం.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

కృష్ణంరాజును మెదక్ .బదలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్యామ్యూల్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

విద్యుత్ సిబ్బంది దుడుకుతనం

విద్యుత్‌శాఖ సిబ్బంది అనుచిత ప్రవర్తన వినియోగదారులకు ఇబ్బందులు కలుగజేస్తున్నది. విద్యుత్ వాడకాన్ని పరిశీలించేందుకుగాను కొంత మంది సిబ్బందిని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో ఇళ్లకు వెళ్లి ఎంతెంత విద్యుత్ వినియోగిస్తున్నారు; ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాల వివరాలు నమోదు చేసేందుకు పంపారు. వీళ్లు ఎవరనేది చెప్పకుండానే నేరుగా ఇళ్లలోకి వచ్చి దురుసుగా మాట్లాడుతుండడంతో వినియోగదారులు వచ్చింది దొంగలా, దొరలా తెలుసుకోలేక పోతున్నామని వాపోతున్నారు. అసలే పట్టపగలు దొంగతనాలు బోరందుకునే తరుణంలో విద్యుత్‌శాఖ సిబ్బంది తాము ఎవరనేది గుర్తింపు కార్డులు చూపి, ఇళ్లలోకి వెళ్తే బాగుంటుంది.

వందేళ్ల తెలుగుకథలో జయంపు కృష్ణ ప్రస్తావన!

ప్రముఖ రచయిత మల్లాది కృష్ణమూర్తి విపుల మాసపత్రికలో వ్రాసిన వందేళ్ల తెలుగు కథ వ్యాసంలో అప్పటి ఉత్తమకథలలో ఒకటిగా నెల్లూరు రచయిత జయంపుకృష్ణ వ్రాసిన 'భయం' కథను పేర్కొన్నారు. 1960 - 70 దశకంలో జయంపుకృష్ణ ఈ కథను వ్రాసారు.

ఆకట్టుకొన్న మణిపురి నృత్యం

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మణిపురి నృత్యకళాకారిణి పద్మశ్రీ దర్శన ఝవేరి 26తేది నెల్లూరు గోమతిస్కూల్‌లో ప్రదర్శించిన మణిపురి నృత్యరీతులు కళాప్రియులను రంజింపజేశాయి. బలరామకృష్ణుల బంతాటకు నృత్యాన్ని జోడించి చేసిన విధానం ఆకట్టుకొంది. దర్శన ఝవేరి బృందాన్ని గోమతి స్కూల్ ఛైర్మన్ డాక్టర్ రాజశేఖర్, కరస్పాండెంట్ అరుణ సన్మానించారు.

పేరూరి నరసింహులుశెట్టి మరణం

నెల్లూరు నగరంలో ఆర్యవైశ్య ప్రముఖుడు, పిసిసి సభ్యుడుగా గతంలో పని చేసిన పేరూరి నరసింహులుశెట్టి (61) నవంబర్ 30తేదీ గుండె పోటుతో మరణించారు. నరసింహులు శెట్టి ముఖ్యమంత్రి రోశయ్యకు వీరాభిమాని. రోశయ్య ముఖ్యమంత్రికాగానే నెల్లూరు నగరంలో ఫ్లెక్స్ బోర్డు పెట్టిన ఏకైక వ్యక్తి నరసింహులుశెట్టి. గతంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షునిగా కూడా పని చేశారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డితోపాటు ఆయన అనుచరులు సైతం నరసింహులు శెట్టిని విపరీతంగా అభిమానించేవారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె వున్నారు.

పుట్టా వెంకట రామచంద్రారెడ్డి మరణం

నెల్లూరు మునిసిపల్ విశ్రాంత వుద్యోగుల సంఘం నేత, మంచిమనిషి, పుట్టా గోపాలరెడ్డి తనయుడు మాముడూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకటరామచంద్రారెడ్డి(52) 2తేది విధినిర్వహణలో వుండగా గుండెపోటు రావడంతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు.

ఆత్మీయులను కోల్పోయిన పై రెండు కుటుంబాల వారికి సానుభూతి.

జగన్ భవితవ్యం

15వ పేజీ కొరవ

చేయాలో, ఏ వ్యూహం పన్నాలో అర్థం కావడం లేదు. ఒక పక్క ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోవడం, మరొకప్రక్క గాలి జనార్దనరెడ్డి మీద ముప్పేట దాడి జరిపించడం కాంగ్రెస్ అధిష్టానం ఆలోచనకు అద్దం పడుతున్నాయి. సిఎల్పీలో తన కోసం గొంతు విప్పుతారను కొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా నోరు తెరవలేదు. ఆ ప్రయత్నం చేస్తే అభాసుపాలౌతామని తానే మౌన వ్రతం పాటించాడు. కానీ ముఖ్యమంత్రి పదవిని వదలుకోవడం ఆయన మనసు అంగీకరించడం లేదు. ఆ పదవి తనకు దక్కకుండా పోయిందన్న అక్కసుతో వేగి పోతున్నాడు. ఏమి చేస్తే కాంగ్రెస్‌నేతలు భయపడి దారికి వస్తారో తెలియడం లేదు. తాను పోరాటం నుంచి పూర్తిగా విరమించుకోవడంలేదని చెప్పడం కోసం, త్వరలో రాష్ట్ర పర్యటన చేస్తానని మేకపోతు గాంభీర్య ప్రకటనలు చేసి సరిపెడుతున్నాడు - ప్రస్తుతానికి. ముందు ముందు అనుసరించాల్సిన వ్యూహం పట్ల ఆయనకే సరైన అవగాహన లేదు. ఆలోచనలూ ముందుకు సాగడం లేదు.

జనవాణి

2వ పేజీ కొరవ

పోలీసు కుటుంబాలకు చేయూత!

హైదరాబాద్‌లో నక్సలైట్ల చేతిలో హతుడైన కెఎస్ వ్యాస్ కుటుంబానికి ఇచ్చిన ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో హతుడైన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ కుటుంబానికి సాయం చేయడంలో అలసత్వం జరిగింది. అదేవిధంగా వెంకటగిరి పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తూ వీరమరణం పొందిన పోలీసులకు ఇంతవరకు సాయం అందించకపోవడం బాధాకరం. జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఈ విషయంలో ప్రేక్షకపాత్ర వహించడం తగదు.

ప్రొఫెసర్ కె.ఎన్.రావు, హైదరాబాద్.

బాలసుబ్రహ్మణ్యంకు కళాప్రపూర్ణ!

విశ్వవ్యాప్తంగా ఆశేష అభిమానులను కలిగిన నెల్లూరీయుడు, సుమధుర గాయకుడు పద్మశ్రీ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యంకు ఆంధ్రా యూనివర్శిటీ కళాప్రపూర్ణ అవార్డుతో గౌరవించడం ఆనందాన్నిచ్చింది. ఈ పురస్కారం సింహపురీయులకే కాక వాదవాదలా వున్న కళాభిమానులనూ ఆనందపరుస్తుంది. ఇప్పటికే పలు అవార్డులు పొందిన బాలసుబ్రహ్మణ్యం కీర్తికిరీటంలో ఈ అవార్డు కలికితురాయిగా భాసిల్లుతుందనడంలో సందేహం లేదు.

సి.హెచ్.హనుమంతరావు, నెల్లూరు.

మంత్రికి చెప్పకుండానే మేయర్‌మీద దర్యాప్తు!

ఈ అవమానం భరించడం దుస్సహంగా వుంది, పాపం!





నెల్లూరు మేయర్ నందిమండలం భానుశ్రీ అక్రమాల మీద దర్యాప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మునిసిపల్ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఇతర కమ్యూనిస్టు కార్పొరేటర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మునిసిపల్ ఛైర్మన్లు, మేయర్లు తమ విధి నిర్వహణలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించకుంటే, వారిని పదవుల నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి వుంది. మునిసిపల్ చట్టంలోని 679-బి సెక్షన్ ఈ అధికారాన్ని కల్పిస్తున్నది. ఇదే చట్టాన్ని అడ్డదుడ్డంగా వాడుకొని మాజీ మేయర్ పులిమి శైలజను పదవి నుంచి తొలగింపచేశాడు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. ఆమె చేసిన తప్పు ఏమీ లేకపోయినా, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద తమకున్న పలుకుబడిని వాడుకొని, పులిమి శైలజను తొలగించి, భానుశ్రీని ఆ కుర్చీలో కూర్చోబెట్టకుంటే విషం త్రాగి చస్తానని ఏడ్చి, ఆగబాగాలు సృష్టించి మరీ ప్రభుత్వం చేత పులిమి శైలజ తొలగింపుకు నోటీసు ఇప్పించాడు వివేకానందరెడ్డి. అందుకోసం ఆయన దాదాపు ఏడాదిన్నరపాటు హైదరాబాదులో అందరి గడపలు తొక్కాడు. అందరి కాళ్లకు మొక్కాడు.

భూమి గుండ్రంగా వుంటుందన్నట్లు, తాను ఏ చట్టంలోని లొసుగును వాడుకొని తనకు ప్రత్యర్థి అయిన మేయర్‌ను పదవి నుంచి తప్పించాడో, అదే చట్టంలోని అదే లొసుగు ఆధారంగా ఇప్పుడు తనకు ప్రియమైన మేయర్ భానుశ్రీ మీద అదే తరహా తొలగింపు దర్యాప్తు, కేవలం పది రోజుల స్వల్ప ప్రయత్నంతోనే వచ్చింది.

భానుశ్రీ మునిసిపల్ చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్నదని కమ్యూనిస్టు కార్పొరేటర్ల ప్రధాన ఆరోపణ. పాత స్పిన్నింగ్ మిల్స్ లేఅవుట్‌లోని రిజర్వుడ్ స్థలాన్ని ఒక ప్రైవేటు సంస్థకు అనధికారికంగా అప్పచెప్పి, అక్కడ వారు రెండంతస్థుల భవనం కట్టుకోవడానికి అనుమతించారని; దీనిపై ఫిర్యాదు వస్తే, ఆ రిజర్వ్ స్థలం ఖాళీగానే వున్నట్లు మునిసిపల్ సమావేశం అజెండాలో చూపించి కార్పొరేషన్ సభ్యులను మోసం చేశారని; తన స్వంత డివిజన్‌లో ఒక త్రీ స్టార్ హోటల్ యజమానులు మునిసిపల్ కాలువను ఆక్రమించి, భవనాలు కట్టుకొనేందుకు అక్రమంగా అనుమతించారని; చట్ట ప్రకారం ఏర్పడవలసిన స్టాండింగ్ కమిటీలను నియమించడం లేదని; కార్పొరేషన్ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని; తనకు అధికారం లేకున్నా, అత్యవసరం కాని పనులకు కూడా ఇన్ యాంటిసిపేషన్ ఉత్తర్వుల ద్వారా లక్షలాది రూపాయల పనులు చేయిస్తున్నారని; మునిసిపల్ సమావేశాలలో అజెండా అంశాల మీద చర్చ జరపకుండా అన్నీ ఆమోదం అయిపోయినట్లు ప్రకటించి వెళ్లిపోతున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలన్నీ, చట్టం ప్రకారం అక్రమాల క్రిందే లెక్క.

నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్లు, గతంలో తాను పులిమి శైలజ మీద ఏ తరహా ఫిర్యాదులు చేశారో, ఇప్పుడు అదే మోస్తరు ఇబ్బందులలో తన ఆప్తురాలైన భానుశ్రీ చిక్కుకోవడం వివేకానందరెడ్డికి మానసిక క్షోభ కల్గిస్తున్నది. అంతకంటే అధికమైన అవమానం – సాక్షాత్తు మునిసిపల్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఏ మాత్రం ముందస్తు సమాచారం లేకుండా, కనీసం ఫైల్‌ను ఆయన పరిశీలనకు కూడా పంపకుండా ఏకంగా సచివాలయం అధికారులు భానుశ్రీ మీద దర్యాప్తుకు ఆదేశించడం. ఈ అవమానం తట్టుకోవడం వారి తరం కావడం లేదు. రామనారాయణరెడ్డికి ఏ మాత్రం ముందుగా తెలిసివుండినా ఈ దర్యాప్తు ఫైలుకు పాతర వేస్తారన్నది జగమెరిగిన సత్యం. అందువల్లనే ఆయన్ను అంధకారంలో పెట్టి, ఉత్తర్వులు జారీ చేశారు అధికారులు.

తాను అవినీతికి పాల్పడలేదని, అందుకు ఎవరైనా రుజువులు చూపిస్తే పదవి నుంచి తప్పుకొంటానని, ఎటువంటి విచారణకైనా తాను సిద్ధమని గంభీరంగా ప్రకటనలు చేస్తున్నారు భానుశ్రీ. అయితే, మేయర్ వంటి రాజకీయ పదవులలో వుండేవారి అవినీతికి సాక్ష్యాలు వుండవని పసి పిల్లవాడికి కూడా తెలుసు. ఇప్పుడు ఆమె మీద వచ్చిన దర్యాప్తు ఆమె చేసిన అక్రమాల మీదనే తప్ప, అవినీతి మీద కాదన్న తేడాను కప్పిపెట్టచూస్తున్నారామె.

అయితే దర్యాప్తుకు ఆదేశాలు తెప్పించినంత సులభంగా దాన్ని కొనసాగింప చేయడం జరిగే పని కాదన్నది నిజం. అదే శాఖ

కొరవ 14వ పేజీలో

జగన్ భవితవ్యం అయోమయం



తాను పోరాటం నుంచి పూర్తిగా విరమించుకోవడం లేదని చెప్పడం కోసం, త్వరలో రాష్ట్ర పర్యటన చేస్తానని మేకపోతు గాంభీర్య ప్రకటనలు చేసి సరిపెడుతున్నాడు జగన్.

ఎట్టకేలకు, చిట్టచివరకు సిఎల్పీ సమావేశం తంతు ముగిసింది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ఫలితాలు వచ్చిన ఒకే ఒక గంటలోపల సిఎల్పీ సమావేశంపై నిర్ణయం తీసుకొన్నది కాంగ్రెస్ అధిష్టానం. ఎక్కువ సమయం ఇవ్వలేదు. ఎవరికీ చర్చలు, సంప్రదింపులు చేసే అవకాశం కల్పించలేదు. ఎవరూ నోరెత్తి మాట్లాడే పరిస్థితి లేకుండా ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని పరిశీలకుడిగా పంపారు. ఆయన స్వభావం అందరికీ తెలుసు. కోపం ముక్కు మీదే వుంటుంది. కదిలిస్తే కరుస్తాడు. ఎవరన్నా లెక్కలేదు. తాను చెప్పిన మాట ధిక్కరిస్తే తన్నినంత పని చేస్తాడు. సమావేశానికి ప్రణబ్ వస్తున్నాడన్న వార్త రాగానే జగన్ శిబిరానికి నవనాడులూ కృంగిపోయాయి. ఇంక తాము చేయగల్గింది ఏదీ లేదన్న నీరసం ఆవహించింది. తప్పు చేస్తే, సరిదిద్దుకొనే తడువు కూడా వుండదన్న భయంతో జగన్ తనంతట తానుగా వెళ్లి, ఫార్చూన్ ఖతియా హోటల్‌లో వున్న ప్రణబ్‌ను కలిశాడు. సిఎల్పీ నేత తీర్మానం మేరకే ప్రతిపాదించాలని ప్రణబ్ చెప్పగానే, హెడ్‌మాస్టర్ ఎదుట బడి పిల్లవాడి వలె తల వూపి మౌనంగా తిరిగి వచ్చేశాడు. సమావేశంలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వమని కోరాడు కానీ, దానికీ ప్రణబ్ ఒప్పుకోలేదు. ఎవరూ మాట్లాడవలసిన అవసరం లేదని నిక్కచ్చిగా చెప్పేశారాయన.

దీనితో జగన్ రాజకీయ భవిష్యత్తుకు తాత్కాలికంగా మసకలు క్రమ్మితే, ముఖ్యమంత్రి రోశయ్య ప్రాభవానికి దేదీప్యమాన కాంతులు సమకూరాయి. అధిష్టానం రోశయ్య పక్షమని స్పష్టంగా అర్థమై పోవడంతో నిన్నటి వరకు జగన్ పక్కన తిరిగిన వారు కూడా చల్లగా రోశయ్య ఇంటి వరండాలో చోటు వెదుక్కొంటున్నారు. మంత్రుల విషయంలో ఈ మార్పు మరింత తేటతెల్లంగా వుంది. సిఎల్పీలో అంత నిరంకుశంగా జగన్‌ను అణచి వేసిన కాంగ్రెస్ అధినాయకత్వం, రోశయ్య బలం పెంచడానికి మంత్రివర్గ మార్పు చేర్పులలో కూడా స్వేచ్ఛ ప్రసాదిస్తుందని పరిశీలకుల భావన. తెలంగాణా ఉద్యమ చీకాకు లేకుంటే, 6తేది ఉదయం క్యాబినెట్ ప్రక్షాళన జరిగిపోయి వుండేది. కానీ ఆ నిప్పు చల్లారకుండా రాజుకొంటూనే వుండడంతో, శాసనసభ సమావేశాలు ముగిసేవరకు వెనక్కు నెట్టారు. మంత్రివర్గంలో మార్పులు చేయలేనప్పటికీ, రోశయ్య ఇక నుంచి తిరుగులేని ముఖ్యమంత్రి. ఆయన ఇదివరకటి వలె మెత్తగా వుండే పరిస్థితి లేదు. తనను, అధిష్టానాన్ని ధిక్కరించి, అవమానకర రీతిలో మాట్లాడిన వారిని ఒక పట్టు పట్టి చూడబోతున్నాడని చెప్పున్నారు. ఆ వార్తలు జగన్ మెహర్బానీకి నోరు పారేసుకొన్న మంత్రుల వెన్నులో చలి పుట్టిస్తున్నది. తమ పదవులు వుంటాయో వూడుతాయో అర్థం కాక మానసిక వేదన అనుభవిస్తున్నారు.

జగన్ పరిస్థితి కూడా ఇంచుమించు అంతే. తానిప్పుడు ఏమి

కొరవ 14వ పేజీలో

J/Nellore/008/09-11
Regn.No. : RN 1156 / 57
16
4 డిసెంబర్ 2009
ప్రకటన



ఒక లక్ష్యంతో గట్టిగా కృషిచేస్తే...
ఆ వ్యక్తి సాధించలేనిది ఏది లేదు!

ప్రయత్నం, సాహసం... ధైర్యం, బుద్ధి బలం...

శక్తి, పరాక్రమం... ఈ ఆరు గుణాల సుసంపన్నుడవు నీవు...

దీనికి నిలువెత్తు సాక్ష్యం ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో

జర్నలిస్ట్‌గా నీ ప్రతిభ.

MAA TV, ACN జిల్లా ప్రతినిధిగా నీ పనితనం,

మంచిని అందరికి పంచాలనే నీ తపన

APUWJ జిల్లా అధ్యక్షుడ్ని చేసింది.

జర్నలిస్టుల సంక్షేమం కోసం నీవు చూసిన సమత, మమత

APWJF రాష్ట్రకార్యదర్శిగా

రెండవసారి కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేసింది.

కృషిపైన అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

అది నీ వెంట ఉంటుందని

మనసారా విశ్వసిస్తూ... శుభాకాంక్షలతో...

ముద్దు

State secretary
Andhra Pradesh Working Journalists Federation

ఆత్మీయ మిత్ర బృందం

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminyot Press, Nellore.